INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

బుధవారం 07.08.2024
INK OF TRUTH
# జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
సంపుటి - 32 సంచిక -172 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

## ఉపాధ్యాయులూ...
## ఇక గౌరవంగా ఉద్యోగం చేసుకోండి



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రతిరోజూ ఉదయం పాఠశాలకు రాగానే బాత్‌రూమ్‌ల పరిశుభ్రతను తెలిపేలా వాటి ఫొటోలను తీసి అప్?లోడ్ చేసేపని ఇక ఉపాధ్యాయులకు లేదని, ఈ విధానాన్ని ఆపేశామని.. ఈ ఆప్షన్‌ను యాప్ నుంచి కూడా తొలగించామని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను పిల్లలకు టీచర్లు అందించాలని, క్రమశిక్షణ, ఉన్నత విలువలతో విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యతను తాము తీసుకుంటామని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## ఆగస్టు 15న 100 అన్న క్యాంటీన్లు ప్రారంభం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆగస్టు 15వ తేదీన రాష్ట్రంలో 100 అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. 33 మున్సిపాలిటీల్లో 100 క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే వారం రోజులు అన్న క్యాంటీన్ల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కమిషనర్లకు సూచించారు. క్యాంటీన్ భవనాల్లో కిచెన్ ఏర్పాటు చేసే బృందాలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.
రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో మంత్రి నారాయణ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, డైరెక్టర్ హరి నారాయణన్, ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్కు హాజరయ్యారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటు, డ్రైన్లలో పూడిక తొలగింపు పై కమిషనర్లకు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల్లో క్యాంటీన్ భవనాల నిర్మాణం జరుగుతున్న తీరును పరిశీలించారు. డ్రైన్లలో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

## అన్ని లారీలు తనిఖీలు చేయాల్సిందే



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** కాకినాడ పోర్టు కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమాలకు చెక్పెట్టడంపై ఏపీ ప్రభుత్వం దృష్టి సారించింది. ఎనిమిది విభాగాల పర్యవేక్షణలో చెక్ పోస్ట్లు ఏర్పాటు చేసింది. కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి ముంబయి రోడ్డులో చెక్ పోస్టును ఏర్పాటు చేయగా.. నిన్న ఒక్కరోజే ఆరు లారీల్లో బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో కాకినాడ పోర్టు పీఎస్ వద్ద మరో చెక్ పోస్ట్ ఏర్పాటు చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. కాకినాడ పోర్టు మార్గంలో అన్ని లారీలూ తనిఖీ చేయాలని సూచించారు.
ఇటీవల కాకినాడ పోర్టును పరిశీలించిన ఆయన.. అక్కడ బియ్యం అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించారు. రేషన్ మాఫియాకు కాకినాడ అడ్డాగా మారిందని ఆయన వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. కాకినాడ పోర్టు నుంచి ఇతర దేశాలకు రేషన్ సరుకులు వెళ్తున్నాయని మనోహర్ ఆందోళన వ్యక్తం చేశారు.



# ఇక శరవేగంగా అభివృద్ధి

- మౌళిక సదుపాయాలు-పెట్టుబడులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష
- పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, విమానాశ్రయాలు, డ్రోన్, టవర్, కంటెంట్, గ్యాస్ కార్పోరేషన్లపై సమీక్ష
- రాష్ట్రంలో మరిన్ని విమానాశ్రయాలు, ఎయిర్ స్ట్రిప్ లు.కుప్పం, దగదర్తి, నాగార్జున సాగర్, మూలపేటలలో నిర్మాణం
- 2014 -19లో ప్రతిపాదిత ఎయిర్ పోర్టులను పూర్తి చెయ్యాలని నిర్ణయం
- ప్రతిష్టాత్మక ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ ప్రాజెక్టును నిర్వీర్యం చేశారన్న సీఎం
- ఏపీలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటుపై సీఈవోతో చంద్రబాబు కీలక చర్చలు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** 2014 -19 మధ్య కాలంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వం అనేక ప్రతిష్టాత్మక మౌళిక సదుపాయాల ప్రాజెక్టులు ప్రారంభిస్తే.... వాటన్నింటినీ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గత ప్రభుత్వం కక్ష పూరితంగా రద్దు చేసిన, నిలిపివేసి అన్ని ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించాలని సీఎం అధికారులను ఆదేశించారు. మౌళిక సదుపాయాలు-పెట్టుబడుల శాఖపై ముఖ్యమంత్రి మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. మౌళిక సదుపాయాల ప్రాజెక్టులను నిలిపివేసి సంపద సృష్టి కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం దెబ్బతీసిందని...మళ్లీ ఆ ప్రాజెక్టులు గాడిన పెట్టి...త్వరితగతిన పూర్తి చెయ్యాలని సీఎం ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు, ఏపీ మారిటైం ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పోరేషన్, వివిధ ప్రాజెక్టుల్లో స్పెషల్ పర్పస్ వెహికిల్స్, ఎపి ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని సిఎం అన్నారు. వివాదాలకు తావు లేకుండా అన్ని పోర్టులు, ఫిషింగ్ హార్బర్ లు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ఏపీ మారిటైం మాస్టర్ ప్లాన్‌తో పాటు మారిటైం పాలసీ తీసుకువస్తామన్నారు. నాడు సుదీర్ఘ కసరత్తు చేసి తలపెట్టిన ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో నాడు ప్రతిపాదించిన నెల్లూరు జిల్లా దగదర్తి, చిత్తూరు జిల్లా కుప్పం, పల్నాడు జిల్లా నాగార్జున సాగర్ లలో ఎయిర్ పోర్టులు, ఎయిర్ స్ట్రిప్ ల నిర్మాణంతో పాటు శ్రీకాకుళం జిల్లా మూలపేట ఎయిర్ పోర్టు నిర్మాణం చేపట్టాలని అన్నారు. గతంలో ఈ ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేయడంతో పాటు భూసేకరణ కూడా పూర్తి అయ్యిందని...అయితే గత ప్రభుత్వం వీటిని నిలిపివేసిందని సీఎం అన్నారు. మళ్లీ ఈ ఎయిర్ పోర్టుల నిర్మాణం కార్యరూపం దాల్చాలని ఆదేశాంచారు. రాష్ట్రంలో మొత్తం 12 నుంచి 14 చోట్ల ఎయిర్ పోర్టులు, ఎయిర్ స్ట్రిప్ లు అందుబాటులోకి తేవాలన్నది ప్రభుత్వ ఆలోచన అని చెప్పారు. అనంతపురం జిల్లా తాడిపత్రి, కాకినాడ జిల్లా తుని ప్రాంతంలో కూడా ఎయిర్ పోర్టులు/ఎయిర్ స్ట్రిప్ లు నిర్మించే అంశంపై పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే కర్నూలు ఎయిర్ పోర్టులో ఫ్లైయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేష్ వంటి సంస్థలను తీసుకురావాలన్నారు. ఎయిర్ పోర్టుల ద్వారా సరుకు రవాణా చేసేలా ప్రాజెక్టులు రూపకల్పన చేయాలని సీఎం అన్నారు. ఎయిర్ పోర్టులు, పోర్టులు, నేషనల్ హైవేలు అనుసంధానం చేయడం ద్వారా ఉద్యోగ కల్పనతో పాటు వేగవంతమైన అభివృద్ధి సాధించవచ్చని సిఎం అన్నారు.
ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్ ను జిఎడి పరిధిలోకి, ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ను ఐ అండ్ పిఆర్ పరిధిలోకి తీసుకురావాలి అని సిఎం అన్నారు. ఏపీ టవర్స్ కార్పొరేషన్ ను ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్ లో విలీనం చేయాలన్నారు. ఒక మంచి లక్ష్యంతో నాడు ఎపి ఫైబర్ నెట్ ప్రాజెక్టును తీసుకొస్తే దానిపైనా విషం చిమ్మి బంగారం లాంటి ప్రాజెక్టును నాశనం చేశారని సిఎం అన్నారు. కరెంట్ స్థంభాల ద్వారా ఫైబర్ నెట్ ఏర్పాటు చేసి కేవలం 10 శాతం ఖర్చుతో ప్రాజెక్టును పూర్తి చేశామన్నారు.

2 లో

## సెప్టెంబర్ 7, 8 తేదీల్లో ఆరోగ్య మాత ఉత్సవాలు
### ఆరోగ్యమాత గోడ పత్రాలు ఆవిష్కరణ



**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** జగత్ జనని, ఆరోగ్య ప్రధాయిని, అద్భుతాల మరియ తల్లి, కడప వేలంగిణి ఆరోగ్యమాత ఉత్సవాలు సెప్టెంబర్ 7, 8 తేదీలలో అంగరంగ వైభవంగా జరగనున్నవని,
ఈ మహోత్సవాలలో అందరూ పాల్గొని మరియతల్లి ద్వారా మేలైన ఆరోగ్యము, తల్లి దీవెనలు పొందుకోవాలని, ఆరోగ్యమాత పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ రెవ ఫాదర్ ఎండి ప్రసాదరావు తెలిపారు.
మంగళవారం ఆరోగ్యమాత చర్చి నందు తిరుణాల గోడపత్రాలను మెత్రాసన కోశాధికారి రెవరెండ్ ఫాదర్ సంబటూరు సురేష్,కదిద్రల్ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఈరి మరియన్న, బిషప్ సెక్రటరీ రెవ ఫాదర్, లూర్దు, ఫాదర్ శౌరి, డాన్ బోస్కో రేక్టర్ రెవ ఫాదర్ జార్జి,రెవ ఫాదర్ సుధాకర్ సహాయ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ పిల్లి మహేష్, ఆరోగ్యమాత మదర్ జనరల్ సుపీరియర్ సెల్వి రాయప్పన్, చర్చి పెద్దలతో కలిసి ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా డైరెక్టర్ ఎం డి ప్రసాద్ మాట్లాడుతూ... కడప అపోస్తులికా పాలన అధికారి మోస్ట్ రెవ బిషప్ డాక్టర్ గాలి బాలి ఆదేశాల మేరకు ఆరోగ్య మాత ఉత్సవాలు ఆగస్టు నెల 29వ తేదీ నుండి నవదిన

2 లో

## విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుద్దాం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** భవిష్యత్‌లో జరుగబోయే విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించేలా అందరూ సహాయ, సహకారాలు అందించాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం విజయవాడలోని మంగళగిరి పార్టీ కార్యాలయంలో విశాఖపట్నంకు చెందిన 5 గురు వైసీపీ కార్పొరేటర్లు జనసేన పార్టీలో చేరారు.
ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విభజన తరువాత రాష్ట్రం బలంగా ఉండాలనే లక్ష్యంతో కలిసి పనిచేశామని అన్నారు. ఇన్నాళ్లు ప్రభుత్వ పనుల్లో బిజీగా ఉన్నాను. నాకు ఇష్టమైన విశాఖపట్టణం నుంచే జనసేనలోకి చేరికలు ప్రారంభం కావడం సంతోషంగా ఉంది. వైసీపీ నాకు వ్యక్తిగతంగా శత్రువు కాదు. ఇదే విషయం చాలా సార్లు చెప్పాను. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం. జనసేన పార్టీలో చేరిన వారందరికీ నా తరపున ధన్యవాదాలు. మీ సేవలను పార్టీ గుర్తిస్తుంది. అందరం కలిసి పని చేద్దాం.. ప్రజలకు సేవ చేద్దాం. భవిష్యత్‌లో విశాఖపట్టణం కార్పొరేషన్‌లో కూటమి విజయకేతనం ఎగుర వేయాలి అని' పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.
**పొల్యూషన్ సమస్య:** 'విశాఖపట్టణంలో కాలుష్యం సమస్య చాలా ఎక్కువగా ఉంది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నా శాఖలో ఉంది. సమస్యను నా దృష్టికి తీసుకు రండి. గతంలో వంశీకృష్ణ చెప్పిన ఇష్యూకి సంబంధించి కాలుష్యంపై ఆడిట్ చేయాల్సి ఉంది. విశాఖపట్టణంలో రియల్ ఎస్టేట్ అంశాల, ఇతర సమస్యలు చాలానే ఉన్నాయి. ఆ సమస్యలు అన్నింటినీ పరిశీలించి బాధితులకు తగిన న్యాయం చేద్దాం. మీరంతా జనసేన పార్టీని నమ్మి, నాపై గౌరవంతో పార్టీలో చేరినందుకు హృదయ పూర్వకంగా స్వాగతం చెబుతున్నా అని' కార్పొరేటర్లతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.

## శవం లెగిస్తే తప్ప జగన్ ఏపీకి రావాట్లేదు



మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు

వివరాలు 2 లో

## మా రాష్ట్రాన్ని ఆదుకోండి

- ఆర్థిక కష్టాల నుంచి కేంద్రమే గట్టెక్కించాలి
- రెవెన్యూ లోటు, అప్పుల భారం నుంచి బయటపడేందుకు చేయూత ఇవ్వండి
- లోక్ సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

2 లో

# మైనార్టీలను దగా చేసిన జగన్

- 2014-2019లో మైనార్టీల సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం పెద్దపీట
- 2019-2024లో మైనార్టీ పథకాలను నిర్వీర్యం చేసిన జగన్
- మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అమరావతి ఆగస్టు 6 రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసిపి పాలనలో మైనార్టీల సంక్షేమం కు తీవ్ర విఘాతం కలిగిందని, మైనార్టీలందరినీ జగన్ ప్రభుత్వం దగా చేసిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. 2014-2019 టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి ఎన్నో పథకాలను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిందని అన్నారు. స్వర్ణయుగంలా టిడిపి ప్రభుత్వంలో మైనార్టీల సంక్షేమం సాగిందని, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టీడీపీ చేపట్టిన సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేసి నిర్వీర్యం చేయడం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు.
రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 43.46 లక్షల మంది మైనార్టీలు ఉన్నారని అన్నారు. ఇందులో ముస్లింలు 36.18 లక్షలు, క్రిస్టియన్ లో 6.83 లక్షలు, సిక్కులు 0.10 లక్షలు, బుద్ధిస్టులు 0.04 లక్షలు, జైనులు 0.27 లక్షలు, పార్సీలు 0.04 లక్షలు ఉన్నారని అన్నారు.
టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రధానమంత్రి జన వికాస కార్యక్రమం,సిఎస్ఎస్ కింద 60:40 భాగస్వామ్యంలో భాగంగా రూ. 447.06 కోట్లు మంజూరు కాగా,రూ. 93.67 కోట్లతో 77 ప్రాజెక్టులను చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో 10 జూనియర్ కళాశాలలు, 9 ఐటిఐ కళాశాలలు, 5 పాలిటెక్నిక్ కళాశాలలు, 18 రెసిడెన్షియల్ పాఠశాలలు, 35 హాస్టలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో 16 ప్రాజెక్టులు పూర్తయ్యాయని,13 నిర్మాణంలో ఉన్నాయని 43 ప్రారంభం కాలేదు అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెండింగ్ పనుల పూర్తిని గాలికి వదిలేసి,పనులన్నింటినీ నిలిపి వేశారని ధ్వజమెత్తారు.
విజయవాడలో రూ. 80 కోట్లతో టిడిపి ప్రభుత్వం హజ్ భవనాన్ని మంజూరు చేస్తే వైసిపి ప్రభుత్వం హజ్ భవన నిర్మాణాన్ని అసలు పట్టించుకోలేదనివిమర్శించారు
ఉర్దూ భవనాలు, షాది ఖానాల నిర్మాణానికి టిడిపి ప్రభుత్వం 342 ప్రాజెక్టులు మంజూరు చేశామని, 196 పూర్తయ్యాయని,146 ప్రారంభం కాలేదని,రూ. 83.15 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వం కేవలం 46 ప్రాజెక్టను మంజూరు చేసి, 2 ను మాత్రమే పూర్తి చేయడం మైనారిటీల పట్ల ఆ పార్టీకి ఉన్న వైఖరి స్పష్టం అవుతుందని అన్నారు.
కడపలో హజ్ భవనం నిర్మాణం కోసం రూ. 24 కోట్లు మంజూరు చేసామని,రూ. 15 కోట్లతో 80 శాతం పనులు పూర్తి అయినప్పటికీ, టిడిపి ప్రభుత్వం చేపట్టిందన్న ఒకే ఒక కారణంతో సీఎంగా తన సొంత జిల్లా కేంద్రంలో జగన్ హజ్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడం సైకో పాలనకు అద్దం పట్టిందని విమర్శించారు.
గుంటూరులో క్రిస్టియన్ భవనం నిర్మాణం కోసం రూ. 16 కోట్లు మంజూరు చేసి,రూ. 10 కోట్లతో 50% పనులు టిడిపి ప్రభుత్వం పూర్తి చేస్తే, వైసీపీ ప్రభుత్వం ఆ పనులను పూర్తిగా నిలిపివేసిందని అన్నారు.
రాష్ట్రంలో 648 వక్ఫ్ ఇన్స్టిట్యూషన్స్ నిర్మాణాలు, మరమ్మతుల కోసం రూ. 57.58 కోట్లతో పనులు చేపట్టి 60 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని, మూడు షాపింగ్ కాంప్లెక్స్ లను రూ. 1.65 కోట్లతో చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ స్కీంల పనులన్నింటినీ వైసిపి ప్రభుత్వం పూర్తిగా డిస్కంటిన్యూ చేసిందని ఫరూక్ విమర్శించారు.
రాష్ట్రంలో గ్రాంట్ రూపంలో 2014 -2019 కాలంలో 977 చర్చిల నిర్మాణానికి రూ. 70.36 కోట్లు నిధులు మంజూరు చేసి,377 పనులు పూర్తి చేయడం జరిగిందని ఇందుకోసం రూ. 56.55 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. మిగిలిన పనులను చేపట్టకుండా వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసి మైనార్టీల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు.
మైనార్టీలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసేందుకు బ్యాంకు లింకేజీ ద్వారా రాయితీతో కూడిన వివిధ స్కీములను టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టి 48892 మంది లబ్ధిదారులకు రూ. 278.44 కోట్ల లబ్ధి చేకూర్చడం జరిగిందని, మైనార్టీలకు శిక్షణ ఉపాధి కల్పన కింద 41088 మందిలబ్ధిదారులకు రూ. 53.89 కోట్లు ఖర్చు చేశామని, ప్లేస్మెంట్ లింక్డ్ కింద క్రిస్టియన్ మైనార్టీలకు స్వయం ఉపాధి శిక్షణకు 2814 మంది

2 లో

## చంద్రబాబుతో రాష్ట్రానికి పూర్వవైభవం
- ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు



**( పొలిటికల్ డెస్క్ , జర్నలిస్ట్ ఫైల్ )** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధి దిశగా అడుగులేస్తుందని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు వివరించారు. అమరావతిలో వేసిన రోడ్లను వైసీపీ నేతలు మాయం చేశారని ఆరోపించారు. ఆంధ్ర ప్రదేశ్‌కు రూ. 15 వేల కోట్ల ఆర్థిక సాయం చేస్తామని కేంద్ర

2 లో

## అధికారులు నిర్లక్ష్యంతో ఉంటే వదిలేది
### విధుల్లో నిర్లక్షంగా వ్యవహరిస్తున్న ఎస్ఈ ప్రసాద్ బాబు పై వేటు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ప్రభుత్వం దగ్గర అభివృద్ధికి సరిపడినంతా నిధులు లేకపోయినా ప్రజాసంక్షేమానికి కట్టుబడి పని చేయాలని అధికారులకు సూచించారు.

2 లో

# మైనార్టీలను దగా చేసిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారులకు రూ. 0.95 కోట్లు టీడీపీ ప్రభుత్వం 2014-2019 లో ఖర్చు చేయగా, ఈ స్కీములన్నింటినీ కూడా దుర్మార్గపు వైసిపి ప్రభుత్వం డిస్కంటిన్యూ చేసిందని అన్నారు.

రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం చంద్రబాబు సీఎంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో, సైకో జగన్ నాయకత్వంలో రాష్ట్రంలోనే మైనార్టీలందరూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, మైనార్టీ సంక్షేమ పథకాలు అన్నీ నిర్వీర్యం అ-య్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వం నేతృత్వంలో మైనార్టీల సంక్షేమం కోసం, అవసరమైన అన్ని సంక్షేమ పథకాలు అమలు కోసం వడివడిగా టిడిపి - జనసేన -బిజెపి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ పేర్కొన్నారు.

## టీచర్లకు బాత్రూం ఫోటో తీసే భాధ్యత నుండి మినహాయింపు పై హర్షం



○విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికు ధన్యవాదాలు తెలిపిన విజయ్ భాస్కర్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఉపాధ్యాయులకు విద్యాబోధన కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్న యాప్ లలో ఒకటైన బాత్రూం ఫోటోలను తీసే బాధ్యత ను తొలగించడం సంతోషకరం అని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ ఒకప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ గారిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా టీచర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించినట్టు ఆయన తెలిపారు. విద్యావ్యవస్థ ను గాడిలో పెట్టడానికి 117 జీవో ను రద్దు చేయాలని, టీచర్లకు నాడు నేడు బాధ్యత ల నుండి మినహాయించాలని, డి ఇ ఓ పూల్ లో ఉన్న భాషాపండితుల సమస్యలు తీర్చాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా చేపట్టాలని కోరినట్టు తెలిపారు.

## ఐదేళ్ల కాలంలో కాల్వల్లో పూడికలు కూడా తీయలేదు : మంత్రి నిమ్మల



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులు నిండుతున్నాయని ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్నడూ లేనంతగా అన్ని ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయి నీటి మట్టాలు ఉన్నాయని తెలిపారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. "రాయలసీమకు సాగు, తాగు నీరు అందిస్తున్నాం. ముందుగా రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నింపుతున్నాం. జగన్ ఐదేళ్ల కాలంలో కాల్వల్లో పూడికలు కూడా తీయలేదు. కాల్వలకు మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాం. జగన్ ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖ అధికారులకు పనిలేకుండా పోయింది" అని విమర్శించారు. ఈస్ట్, వెస్ట్ కెనాల్ ఎస్ఈ ప్రసాద్‌బాబుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. నీటి విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్ఈ బదిలీకి మంత్రి ఆదేశించారు.

# ఇక శరవేగంగా అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)



24 వేల కిలోమీటర్ల మేర ఫైబర్ నెట్ నిర్మాణం చేసి 9 లక్షల కనెక్షన్ లు ఇచ్చామని అన్నారు. గత ప్రభుత్వ రివర్స్, అసమర్థ పాలన వల్ల 9 లక్షల ఫైబర్ నెట్ కనెక్షన్ లు 5 లక్షలకు పడిపోయాయని...వాటిలో కూడా నాణ్యమైన సేవలు అందించలేదని సిఎం అన్నారు. నాడు నెలకు రూ. 149 లకే సెట్ టాప్ బాక్సుల ద్వారా ఇంటర్ నెట్, కేబుల్ టీవీ ప్రసారాలు అందిస్తే....వైసీపీ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును రూ. 1258 కోట్ల అప్పుల్లోకి నెట్టేసిందని అన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన కంటెంట్ కార్పొరేషన్, డ్రోన్ కార్పొరేషన్, ఏపీ టవర్స్ కార్పొరేషన్, గ్యాస్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లను కూడా మళ్లీ గాడిలో పెట్టి సేవలు పునరుద్దరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నాడు జిల్లాల్లో నిర్మాణం తలపెట్టిన ఆర్టిజి సెంటర్లు పూర్తిచేయాలని సూచించారు. సీసీ కెమెరా నెట్ వర్క్ ను వీటికి అనుసంధానం చేయాలని సిఎం అన్నారు.

ఏపీలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటుపై కీలక చర్చలు

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులపై దృష్టి సారించిన సీఎం చంద్రబాబు నాయుడు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే యూట్యూబ్ గ్లోబల్ సీఈవో నీల్ మోహన్, గూగుల్ ఏపీఏసీ హెడ్ సంజయ్ గుప్తాతో ఇవాళ సమావేశమైన చంద్రబాబు ఏపీలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం వారితో ఆన్‌లైన్‌లో సమావేశమైన చంద్రబాబు నాయుడు.. ఏపీలో పెట్టుబడుల గురించి చర్చించారు. ఈ విషయాన్ని చంద్రబాబు నాయుడు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా వెల్లడించారు.

యూట్యూబ్ గ్లోబల్ సీఈవో నీల్ మోహన్, గూగుల్ ఏపీఏసీ హెడ్ సంజయ్ గుప్తాతో సమావేశం కావడం చాలా ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. స్థానిక భాగస్వాములతో కలిసి ఏపీలో యూట్యూబ్ అకాడమీ ఏర్పాటుపై వారితో చర్చించామని తెలిపారు. యూట్యూబ్ అకాడమీ ఏర్పాటు ద్వారా కంటెంట్, స్కిల్ డెవలప్‌మెంట్, ఏఐ, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్స్ వంటి వాటిపై ప్రత్యేకంగా పరిశోధనలు చేయవచ్చని అన్నారు. అందుకే యూట్యూబ్ అకాడమీకి సంబంధించి అమరావతిలో భాగమైన మీడియా సిటీలో సాంకేతిక సహాయం అందించడానికి ఉన్న అవకాశాలను వారితో చర్చించామని చంద్రబాబు వెల్లడించారు.

# గత విధానాలను సవరించకుండా వర్క్ అడ్జస్ట్మెంట్ చేయడం సరికాదు : ఏపిటిఎఫ్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** గత ప్రభుత్వ విధానాల వలన అస్తవ్యస్తంగా మారిన విద్యారంగ సమస్యలను పరిష్కరించకుండా పని సర్దుబాటు చేయడం సరైనది కాదని ఏపిటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. హృదయ రాజు, యస్. చిరంజీవి అన్నారు.

రాష్ట్రంలో గత ప్రభుత్వంలో తీసుకున్న తొందరపాటు, అశాస్త్రీయ నిర్ణయాల వలన తెలుగు మీడియం రద్దు, తరగతుల విలీనం, ఉపాధ్యాయులకు అధిక పీరియడ్ల కేటాయింపు, అనవర యాప్స్ తదితర సమస్యలు వచ్చాయని, అదేవిధంగా అధికారుల ఇష్టారాజ్యంతో విద్యా వ్యవస్థ కుదేలయిందని వాటిని నూతన ప్రభుత్వం సరిచేయాలని కోరారు.

ప్రధానోపాధ్యాయుల మరియు ఇతర సబ్జెక్టు టీచర్ల ఖాళీలను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాల్సింది పోయి, ఇంకా వర్క్ అడ్జస్ట్మెంట్ చేయడం సబబు కాదని అన్నారు. 117 జి.ఓ ను రద్దు చేయకుండా ఉపాధ్యాయుల సర్దుబాటు తగదన్నారు. సమాంతర మీడియం అమలు, టీచర్లకు బోధనా పిరియడ్ల తగ్గింపు, ఉన్నత పాఠశాలల్లో 130 రోల్ వద్ద, యూ.పి లో 98 రోల్ వద్ద ఒక హెడ్మాస్టర్, వ్యాయమ ఉపాధ్యాయులు (ఫిజికల్ డైరెక్టర్) పోస్టులకు పదోన్నతులు కల్పన వంటి సమస్యలను అత్యవసరమైనవిగా భావించి పరిష్కరించాలని ఏపిటీఎఫ్ కోరింది. వీటి అనంతరం డీఎస్సీ పూర్తి అయ్యేలోపు ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో విపరీతంగా పోస్టుల అవసరం వున్నందున 1998 క్వాలిఫైడ్ మిగిలిన వారికి మరియు అకడమిక్ ఇన్స్ట్రక్టర్స్ లను నియమించాలని నేడు డైరెక్టర్ పి. పార్వతి గారికి ప్రాతినిధ్యం చేసినట్లు తెలిపారు

# చంద్రబాబుతో రాష్ట్రానికి పూర్వవైభవం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రకటన చేసిందని గుర్తుచేశారు. కేంద్ర సంస్థలకు సీఎం చంద్రబాబు స్థలం కేటాయించారని, ఇప్పుడు రాజధానిలో నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే రఘురామ పేర్కొన్నారు. మంగళవారం నాడు రఘురామ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

**అభివృద్ధిలో ముందంజ..**

ఏపీలో ప్రభుత్వం మారింది, చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 55 రోజులు అవుతుందని గుర్తుచేశారు. సమయం ఇవ్వకుండా వైసీపీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని హితవు పలికారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. జగన్ ప్రభుత్వం ఎంత అప్పు చేసిందో ఇంకా తెలియడం లేదని.. దీనిపై ఓ స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. చంద్రబాబుకు ఏపీని అభివృద్ధి చేసే సామర్థ్యం ఉందని ఎమ్మెల్యే రఘురామ తెలిపారు.

**గజం రూ.40 వేలు**

"అమరావతిలో గజం ఇప్పుడు 40 వేలు ఉంది. ప్రజలకు ప్రభుత్వంపై విశ్వాసం ఉంది. రాజధాని అమరావతి అని అందరికీ నమ్మకం కలిగింది. తెలంగాణలో రియల్ ఎస్టేట్ స్తబ్ధత నెలకొంది. తెలంగాణలో రేట్లు 10 శాతం తగ్గాయి. దీనికి కారణం ఏపీలో చంద్రబాబు నాయుడు రావటం. చంద్రబాబు హయాంలో ఒక విజన్ ఉంది. గతంలో కొందరు కలెక్టర్లు వైసీపీకి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించారు. ఐఏఎస్‌కు పూర్వవైభవం వచ్చేలా ఈ ప్రభుత్వం ఉంది. ఐఏఎస్‌లకు చంద్రబాబు గతంలో ఎక్కువ గౌరవం ఇచ్చే వారు. ఇప్పుడు ఎమ్మెల్యేలకు సమయం ఇస్తామని కూడా చెప్పారు. ఎమ్మెల్యేలను జగన్ గతంలో పట్టించుకోలేదు. అందుకే ఆయన 11 సీట్లకే పరిమితం అయ్యారు. జగన్మోహన్ రెడ్డి నుంచి గతంలో అందరికీ ముప్పు ఉండేది. ఇప్పుడు జగన్‌కి ప్రజల నుంచి ఎలాంటి ముప్పు లేదు" అని రఘురామ పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 7,8 తేదీల్లో ఆరోగ్య మాత ఉత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

పూజ ప్రార్థనలతో ప్రారంభం కానున్నవని, ఆయన తెలిపారు. 29వ తేదీ పతాక ఆవిష్కరణకు, ముఖ్య అతిథులుగా కర్నూలు మెత్రాణులు మోస్ట్ రెవ డాక్టర్ బిషప్ శ్రీ గోరంట్ల జ్వనేష్, సెప్టెంబర్ 8న కడప అపోస్తులికా పాలన అధికారి మోస్ట్ రెవ బిషప్ డాక్టర్ గాలి బాలి,

హాజరవుతున్నారని తెలిపారు.

ఆగస్టు 30వ తేదీ నుండి, సెప్టెంబర్ ఆరో తేదీ వరకు, ప్రతిరోజు సాయంత్రం ఐదు గంటల దివ్యబలి పూజను సమర్పించడానికి, రాష్ట్ర నలుమూలల వివిధ విచారణకు చెందిన, పేరు ప్రఖ్యాతి కలిగిన గురువులు ఆరోగ్యమాత సన్నిధానంలో మరియ తల్లిని గూర్చిన అద్భుత సందేశాలను

అందించటానికి హాజరవుతున్నారని అన్నారు.

ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో విశ్వాసులు ఆరోగ్యమాత సన్నిధానానికి వచ్చి, మరియ తల్లిని ముఖాముఖిగా దర్శించుకుని సకల ఆరోగ్యాన్ని , ఐశ్వర్యాన్ని పొందుకోవాలని జిల్లా ప్రజలను ఆయన ఆహ్వానిస్తున్నామని అన్నారు.

## అధికారులు నిర్లక్ష్యంతో ఉంటే వదిలేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఇరిగేషన్ శాఖను జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లు మూత వేశారని ఆరోపించారు. ఐదేళ్లలో ఇరిగేషన్ అధికారులు తమ పనులే మర్చిపోయిన పరిస్థితి ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు.

నీటి విడుదల విషయంలో కృష్ణా బోర్డు ఎస్ఈ నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. గతంలో పట్టిసీమ, కృష్ణా, బ్యారేజ్ వద్ద నీటిను రెండు కెనాళ్ల ద్వారా పంపమని, అయితే ఇప్పుడు అలా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, రైతులు వద్ద ఫీడ్ బ్యాక్ వచ్చిందని చెప్పారు. ఎంత నీరు విడుదల చేస్తున్నారని అడిగితే లేని పోని సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. నిన్న గట్టిగా అధికారులను ప్రశ్నిస్తే 11 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే వదిలామని చెప్పారని అన్నారు. ప్రకాశం బ్యారేజ్‌లో ఉన్న నీటిని ఉపయోగించలేదని పై నుంచి విడుదల చేయలేదని అన్నారు. ఈ విషయంపై సీరియస్‌గా ఉన్నామని, ఎస్ఈ ప్రసాద్ బాబును ఈఎన్సీకి సరెండర్ చేయాలని అదేశించామని అన్నారు. నిర్లక్ష్యంతో ఉన్నఅధికారులను వదిలేది లేదని హెచ్చరించారు. ఈ శాఖకు అనుగుణంగా అధికారులు పని చేయాల్సి ఉందని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. డిపార్ట్మెంట్ విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు తమకు సలహాలు, సూచనలు ఇస్తున్నారని అన్నారు. ప్రతి చుక్కను సద్వినియోగం చేయాలని చూస్తున్నామని, అయితే కొన్ని చోట్లా గండ్లు పడుతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

**రాయలసీమ అభివృద్ధికి కృషి..**

జూలై నుంచే పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. రాయల సీమకు తాగు, సాగు నీరు పుష్కలంగా అందిస్తున్నామని అన్నారు. నాగార్జున సాగర్ పరిధిలో సురక్షితమైన తాగునీరు అందిస్తున్నామని చెప్పారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజ్ వద్ద జలకళ సంతరించుకుందని వివరించారు. వరద నీరు సముద్రంలోకి వెళ్లకుండా ట్యాంక్‌లు నింపుకోవాలని సూచించారు. కొన్ని కాల్వల్లో వృక్షాలు నిండి ఉన్నాయని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్‌లు ఆయకట్టు ఆఖరి ఎకరం వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## మరుగుదొడ్ల ఫొటోల బాధ నుంచి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించిన మంత్రి లోకేష్ కు ధన్యవాదాలు

○ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఇకపై ఉదయాన్నే పాఠశాలలో మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్లోడ్ చేయాల్సిన పని ఉపాధ్యాయులకు లేదని ... ఈ విధానాన్ని ఆపేశామని.. యాప్ నుంచి ఆ ఆప్షను కూడా తొలగించామని ఎక్స్ (ట్విటర్) లో మంత్రి వేదిక గా మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటనపై ఏపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతి రావు ప్రకాష్ రావు పత్రికాముఖంగా మంత్రి లోకేష్ కు ధన్యవాదాలు తెలియజేశారు. .మంత్రి సూచించిన విధంగా... నాణ్యమైన విద్యను పిల్లలకు అందిస్తామని . క్రమశిక్షణ, ఉన్నత విలువలతో విద్యార్థులను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.. టీచర్ల సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమం లో త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి లోకేష్ ను కోరారు.

## ఎమ్మెల్యే మొదటి జీతంతో బ్యాటరీలు, ఇన్వెర్టర్లు

**రంపచోడవరం (జర్నలిస్ట్ ఫైల్):** ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఎమ్మెల్యేగా వచ్చిన తన మొదటి నెల జీతంతో జడ్డంగి, రాజవొమ్మంగి, లాగరాయి ఆసుపత్రులకు సొంతంగా బ్యాటరీలు, ఇన్వెర్టర్లు అందించారు. ప్రజా అవసరాల దృష్ట్యా నా మొదటి నెల జీతంతో సొంతగా ఇన్వెర్టర్లు, బ్యాటరీలను కొనుగోలు చేసి అందిస్తున్నామని ఆమె తెలిపారు.

# శవం లెగిస్తే తప్ప జగన్ ఏపీకి రావట్లేదు : మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** మాజీ మంత్రి కొడాలినాని, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీలను మాజీ మంత్రి పేర్నినాని దాచాడంటూ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. శవం లెగిస్తే తప్ప జగన్ ఏపీకి రావాట్లేదంటూ కొల్లు ఫైర్ అయ్యారు. మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. తన భద్రత పెంచాలని జగన్ అంటుంటే... జగన్ నుంచి తమకు భద్రత కావాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ఏపీలో ఎవరైనా చనిపోయి శవం కనిపిస్తే .. గద్దలా వాలటానికి



జగన్ వస్తున్నారని విమర్శలు గుప్పించారు. పులివెందుల ఎమ్మెల్యేకు సీఎం తరహా సెక్యూరిటీ, పీఎం తరహా భద్రత ఉండదనే విషయం జగన్ తెలుసుకోవాలంటూ సెటైర్ విసిరారు. రాబందులా ఐదేళ్ళు రాష్ట్రాన్ని పీక్కు తిన్న జగన్ అండ్ కో చంద్రబాబు చేసే అభివృద్ధిని చూసి తట్టుకోలేకపోతోందన్నారు. రెడ్ బుక్ పేరు వింటేనే వైసీపీ నేతలు గజగజ వణికిపోతున్నారన్నారు. పాపాలు చేసి పారిపోయిన వైసీపీ నేతలు ఎక్కడ దాక్కున్నా వెతుకొచ్చి దోషులుగా నిలబెట్టేందుకు పోలీసు యంత్రాంగం సిద్దంగా ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు పూర్తిగా రాకముందే కౌంటింగ్ కేంద్రం నుంచి వంశీ, కొడాలినాని పారిపోయారన్నారు. జగన్ పిచ్చికి తగ్గట్టు తమ బందరు పిచ్చోడు పేర్ని నాని తయారయ్యాడన్నారు. సుపరిపాలన కోసం సీఎం వాట్సాప్ గ్రూప్‌లు పెట్టమనటాన్ని పేర్ని నానీ వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. కొడాలినాని, వంశీలను పేర్నినానినే దాచాడనే అనుమానాలు ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో అక్రమ ఆస్తులు కొనటానికి వెళ్తే ప్రజలు తరిమారని.. ఇలానే పేర్నినాని పిచ్చిప్రే లాపనలు పేలితే ఏపీ ప్రజలు కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యలు చేశారు.

# మా రాష్ట్రాన్ని ఆదుకోండి



○ఆర్థిక కష్టాల నుంచి కేంద్రమే గట్టెక్కించాలి
○రెవెన్యూ లోటు, అప్పుల భారం నుంచి బయటపడేందుకు చేయూత ఇవ్వండి
○లోక్ సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

**( పొలిటికల్ డెస్క్ , జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్కు కేంద్రం చేయూత ఇచ్చి ఆదుకోవాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయులు కోరారు. రాష్ట్ర ఆర్థిక దుస్థితిని తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే శ్వేతపత్రం విడుదల చేసిందని.. ఈ ప్రతులను లోక్ సభ, రాజ్యసభ సభ్యులందరికీ అందజేస్తామని చెప్పారు. మంగళవారం ఆయన లోక్ సభలో మాట్లాడారు. ఏపీ ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడుతోందని.. ఆ కష్టాల నుంచి కేంద్రమే గట్టెక్కించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు, చేనేత కార్మికులను మరింతగా ఆదుకోవాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దేశంలో ఆక్వా ఎగుమతులు 70 శాతం ఏపీ నుంచే జరుగుతున్నాయన్న ఆయన.. పీఎం మత్స్య సంపద యోజన కింద ఆక్వా రైతులను ప్రోత్సహించాలని కోరారు.

ఆర్థిక బిల్లుపై చర్చ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని లోక్ సభ దృష్టికి తీసుకెళ్లారు. "ఇతర సభ్యులు చెప్పినట్లు ఏపీకి ప్రత్యేక నిధులు ఏమీ ఇవ్వడం లేదు. పూర్వోదయ పథకానికి కేంద్ర బడ్జెట్లో రూ. 62వేల కోట్లు కేటాయించారు. కోస్తా ప్రాంతంలో పెద్ద రాష్ట్రం గనక ఏపీకి ఎక్కువ నిధులు వస్తాయి. ఏపీ ఖర్చులు రూ. 1.64 లక్షల కోట్లు.. రెవెన్యూ రూ. 1.45లక్షల కోట్లు. ఈ ఏడాదిలో రూ. 19వేల కోట్ల లోటు స్పష్టంగా ఉంది. రాష్ట్ర అప్పు 2019లో రూ. 3.75లక్షల కోట్లు కాగా.. 2024కి రూ. 9.74లక్షల కోట్లకు పెరిగింది. గత ఐదేళ్లలో వృద్ధిరేటు గణనీయంగా తగ్గిపోయింది. ఏపీలో వృద్ధిరేటు 13.5 నుంచి 10.5శాతానికి పడిపోయింది. వ్యవసాయ వృద్ధిరేటు 16నుంచి 10శాతానికి తగ్గిపోయింది. ఐదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడింది. వృద్ధిరేటు దిగజారింది. రాష్ట్ర ద్రవ్యోల్బణం 4.5శాతం నుంచి 6శాతాన్ని మించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా కేంద్రం ఏపీపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. రెవెన్యూ లోటు, అప్పుల భారం నుంచి బయటపడేందుకు చేయూత ఇవ్వాలి. దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ పై పన్ను విషయంలో పునరాలోచన చేయాలి. ఆరోగ్య, బీమా పాలసీలపై 18శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించాలి. టెక్స్టైల్ రంగాన్ని ఆదుకొనేందుకు పత్తి దిగుమతులపై సుంకాలు తగ్గించాలి. ఆర్థిక రంగం నుంచి గతంలో చెల్లించాల్సిన పన్నుల విధానాన్ని ఎత్తివేయాలి" అని కోరారు.


## డాక్యుమెంట్ పోయింది

పల్లవి కొండమడుగుల , డాటర్ ఆఫ్ సంజీవరెడ్డి గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ నివాసి అయిన పెదకాకాని సెంటర్ లో ఫోటోస్టాట్ నిమిత్తం తీసుకొచ్చిన డాక్యుమెంటు ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయినది. 1090 /1941 నెంబరు గల ఈ డాక్యుమెంటు ఎవరికైనా దొరికినచో తెలియజేయగలరు.

వివరాలకు సంప్రదించండి
పల్లవి కొండమడుగుల
63 02 69 28 08

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి
జన్మదిన శుభాకాంక్షలు, పొలిటికల్, స్వదేశాగమనం, లీగల్ ప్రకటనలు, క్లాసిఫైడ్స్ పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, సినిమా, వివాహ మహోత్సవం, షష్టిపూర్తి మహోత్సవం మరియు అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం
76 61 80 59 68

# జాతీయం/అంతర్జాతీయం

## సుప్రీంకోర్టు తీర్పును తప్పు పట్టిన చింతా మోహన్

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ తప్పు పట్టారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, దేశ సమగ్రతకు విరుద్ధంగా సుప్రీం కోర్టు తీర్పు ఉందని మాజీ కేంద్ర మంత్రి, చింతా మోహన్ విమర్శించారు. ఈసందర్భంగా ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. సుప్రీం తీర్పు భారత అఖండతను దెబ్బతీసేలా ఉందని, దేశ పౌరుడిగా ధర్మాసనం తీర్పును వ్యతిరేకిస్తున్నానని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు దేశం పేదరికం, కులాల గురించి తెలుసా? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో ఉన్న న్యాయమూర్తులు సంపన్నులని, వారు పేద వర్గాల గురించి తీర్పు ఇస్తారా? అని చింతా మోహన్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఎప్పుడన్న దళిత వాడల్లో తిరిగారా? అని నిలదీశారు. ఎస్సీ వర్గీకరణపై న్యాయస్థానం అనాలోచిత, తల తిక్క తీర్పు ఇచ్చిందన్నారు. దేశంలో వెయ్యి ఉపకులాలు ఉన్నాయని.. ఎలా వర్గీకరణ చేస్తారని అన్నారు. వర్గీకరణపై కమిషన్ వేయాలని, కేంద్ర ప్రభుత్వానికి.. రాష్ట్రాలకు తలకాయ లేదని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపికలో క్రిమిలేయర్ ఉందా? అని ప్రశ్నించారు.

## ప్రపంచానికే మోడల్ కానున్న పునరావాసం



**తిరువనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) :** వయనాడ్ బాధితులకు అందించే పునరావాసం ప్రపంచానికే మోడల్ కానుందని కేరళ రెవెన్యూ మంత్రి కె.రాజన్ తెలిపారు. మంగళవారం మెప్పాడికి సమీపంలోని చురల్‌మలలో మీడియాతో మాట్లాడారు. పునరావాసం అంటే కేవలం బాధితులకు స్థలం, నివాసాలు కల్పించడం మాత్రమే కాదని అన్నారు. పాలు తాగే శిశువుల నుండి వృద్ధుల వరకు జీవితంలో అన్ని కోణాలకు న్యాయం చేయాల్సి వుంటుందని అన్నారు. బాధితుల పూర్తి భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇది ప్రపంచానికే మోడల్‌గా నిలుస్తుందని చెప్పారు. విపత్తు సంభవించిన ప్రాంతాలకు సమీపంలో ఉండే వారు.. ఇకపై అక్కడ నివసించేందుకు భయపడినట్లైతే వారికి కూడా పునరావాసం కల్పిస్తామని చెప్పారు. మొబైల్ ఫోన్స్ పోగొట్టుకున్న వారికి త్వరలోనే అదే నెంబర్‌తో ఫోన్‌లు అందిస్తామని అన్నారు. వారి ఫోన్ కనెక్షన్లు పునరుద్ధరించిన తర్వాత గల్లంతైన వారికోసం చేపడుతున్న సహాయక చర్యలతో పాటు పునరావాస ప్రక్రియకు ఇది సహాయపడుతుందని అన్నారు.

ప్రాణాలతో బయటపడిన వారికి పునరావాసం కల్పించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. మెప్పాడి పంచాయితీ పరిధిలోని చూరల్‌మల, ముండక్కై, పుంఛిరిమట్టంలో స్థలాలను గుర్తించేందుకు బాధితులను అక్కడికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. గల్లంతైన వ్యక్తులను గుర్తించేందుకు రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకున్నామని, వారి జాబితాను ఖరారు చేసేందుకు అంగన్‌వాడీ, ఆశా వర్కర్లను కూడా వినియోగించనున్నామని అన్నారు. స్థానిక పరిపాలనాశాఖ ధ్వంసమైన ఇళ్లను గుర్తిస్తోందని అన్నారు. అటవీశాఖ మంత్రి ఎ.కె.శశీంద్రన్ కూడా రాజన్‌తో పాటు వయనాడ్‌లో పర్యటించారు. చూరల్‌మల వద్ద నదిపై కొత్త వంతెన నిర్మించే వరకు ఆర్మీ నిర్మించిన బెయిలీ వంతెన అలాగే ఉంటుందని శశీంద్రన్ తెలిపారు. కేరళ రాష్ట్ర విద్యుత్ బోర్డ్ (కెఎస్‌ఇబి) ప్రకారం.. విపత్తు జోన్‌లో సుమారు 302 నివాసాలు కొట్టుకుపోయాయి. అయితే 352 నివాసాలు తుడిచిపెట్టుకుపోయాయని, 122 ఇళ్లు దెబ్బతిన్నాయని సోమవారం ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది.

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

వయనాడ్, మలప్పురంలోని వివిధ ప్రాంతాలలో సహాయక చర్యలు మంగళవారం కూడా కొనసాగుతున్నాయి. ఆర్మీ, జాతీయ విపత్తు నిర్వహణ బృందం, కేరళ మరియు తమిళనాడులోని ఫైర్ అండ్ రెస్క్యూ సిబ్బంది సహా వివిధ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి.


## నిర్బంధంలో వున్న విద్యార్థుల విడుదల



**బంగ్లాదేశ్ (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థి ఉద్యమంలో నిర్బంధించబడిన వారి విడుదల ప్రారంభమైందని రాష్ట్రపతి కార్యాలయం పబ్లిక్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ షిప్లూ జమాన్ సంతకం చేసిన ఓ ప్రకటన తెలియజేసింది. దీంతో వివక్ష వ్యతిరేక విద్యార్థి ఉద్యమం, వివిధ కేసుల్లో జులై 1 నుంచి ఆగస్టు 5 వరకు అరెస్టయిన వారి విడుదల ప్రారంభమైంది. ఈమేరకు ఈప్రకటన వెలువడింది. ఇప్పటికే పలువురిని విడుదల చేశామన్నారు.

# యూకే అనుమతులు వచ్చేవరకూ భారత్‌లోనే బంగ్లాదేశ్ ప్రధాని






**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** బంగ్లాదేశ్‌లో హింసాత్మక పరిణామాల నేపథ్యంలో ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా, ఆ దేశాన్ని కొన్ని నిమిషాల వ్యవధిలోనే విడిచి ఇండియాకు వచ్చారు. తాను ఇండియాకు వస్తున్నట్లు ఆమె అభ్యర్థించారని ఈ రోజు రాజ్యసభలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చెప్పారు. తమకు కొన్ని నిమిషాల ముందే ఆమె ఈ విషయాన్ని చెప్పినట్లు తెలిపారు. ఢాకా నుంచి బంగ్లా ఆర్మీకి చెందిన సి -130జె ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఎజెఎఎక్స్ పేరుతో ఢాకా నుంచి టేకాఫ్ అయి, కోల్‌కతా మీదుగా ఢిల్లీకి సమీపంలోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కి చెందిన హిండన్ ఎయిర్ బేస్‌కి చేరుకున్నారు. ప్రస్తుతం ఆమె భారత ఇంటలిజెన్స్ ఏజెన్సీల సురక్షిత కస్టడీలో ఉన్నారు.

బంగ్లా ఆర్మీ హెలికాప్టర్ మధ్యాహ్నం 3 గంటల సమయంలో భారత సరిహద్దు వద్ద అతి తక్కువ ఎత్తులో ఎగురుతున్నట్లు మన రాడార్లు గుర్తించాయి. భారత గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే విమానంలో ఎవరున్నారనే విషయాన్ని తెలుసుకుని భారత్ రాడార్ వ్యవస్థ విమానంపై నిఘా పెంచింది. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సహాయం చేయడానికి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రెండు రాఫెల్ యుద్ధవిమానాలను రక్షణగా పంపాయి. "బంగ్లాదేశ్‌తో ఉన్న భారత సరిహద్దు నుండి 10 కిలోమీటర్ల దూరంలో ఎజెఎఎక్స్ 1431 అనే కాల్ గుర్తుతో కూడిన సి-130 ఎయిర్‌క్రాఫ్ట్‌ను భారతదేశం పర్యవేక్షించడం ప్రారంభించింది. అది ఢిల్లీ వైపు వెళుతోంది. బంగ్లాదేశ్ వైమానిక దళం విమానం సాయంత్రం 4 గంటలకు పాట్నాను దాటి యుపి-బీహార్ సరిహద్దుకు చేరుకుంది." అని అధికారులు తెలిపారు.

షేక్ హసీనా రాజకీయ శరణార్థిగా యూకేలో ఆశ్రయం కోరినట్లు సమాచారం. దీనిపై బ్రిటన్ ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో యూకే ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేవరకు ఆమె భారత్‌లో ఉండేందుకు న్యూఢిల్లీ తాత్కాలిక అనుమతులు ఇచ్చినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఈ సమయంలో హసీనాకు భారత్ సంస్థాగతంగా పూర్తి సహకారం అందించనున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు బంగ్లాదేశ్ తాజా రాజకీయ పరిణామాలపై బ్రిటన్ ప్రభుత్వం స్పందించింది. గత రెండు వారాలుగా అల్లర్ల కారణంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, ప్రాణ నష్టంపై ఐక్యరాజ్యసమితి నేతఅత్వంలో దర్యాప్తు జరిపించాలని అభిప్రాయపడింది. ఈ మేరకు యూకే విదేశాంగ కార్యదర్శి అధికారిక ప్రకటన విడుదల చేశారు. అయితే, ఇందులో షేక్ హసీనాకు ఆశ్రయమిచ్చే అంశాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం.

హసీనా సోదరి రెహానా యూకే పౌరురాలు. ఆమె కుమార్తె తులిప్ సిద్దిఖీ ప్రస్తుతం లేబర్ పార్టీ తరఫున పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం యూకేలో లేబర్ పార్టీనే అధికారంలో ఉంది. ఈ క్రమంలోనే హసీనా బ్రిటన్ ప్రభుత్వాన్ని ఆశ్రయం కోరినట్లు తెలుస్తోంది.

మరోవైపు, బంగ్లాదేశ్‌లో నెలకొన్న కల్లోల పరిస్థితులను భారత ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. దీనిపై చర్చించేందుకు అఖిలపక్షం సమావేశమైంది. బంగ్లా సరిహద్దు రాష్ట్రాలు కూడా అప్రమత్తమయ్యాయి. మేఘాలయలోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి నిరవధిక కర్ఫ్యూ విధిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అటు.. బంగ్లాలో ఉద్రిక్త పరిస్థితుల దఅష్ట్యా రెచ్చగొట్టే వీడియోలు షేర్ చేయొద్దని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. వాటిని వ్యాప్తి చేస్తే రాష్ట్రంలో అసమ్మతి, అశాంతి రగిలే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

# బంగ్లాదేశ్ ప్రధాని భవితవ్యాన్ని అంధకారంగా చేసిన విద్యార్థి ఆందోళన




**బంగ్లాదేశ్ (జర్నలిస్ట్ ఫైల్) :** జులైలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నహిద్, మరికొందరు విద్యార్థులు చేసిన చిన్న ఆందోళన ఉద్యమంగా మారి ఏకంగా ప్రధాని హసీనా భవితవ్యాన్ని అంధకారం చేసింది. వివరాల్లోకి వెళితే ఈఏడాది జులైలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నహిద్ ఇస్లామ్(26), మరికొందరు విద్యార్థులు ఆందోళన చేస్తుండటంతో పోలీసులు అరెస్టు చేశారు. తొలిసారి అతడు బంగ్లాదేశ్ ప్రజల దఅష్టిని అప్పుడే ఆకర్షించాడు. అతడు ఢాకా విశ్వవిద్యాలయంలో సోషియాలజీ విద్యార్థి. బంగ్లాదేశ్ పతాకాన్ని నుదుటకు చుట్టుకొని తరచూ ఆందోళనల్లో మీడియాకు కనిపించాడు. మొత్తం ఉద్యమాన్ని సమన్వయం చేశాడు. ఆ తర్వాత అదే ఉద్యమం తుపానుగా మారి ప్రభుత్వాన్ని చుట్టుముట్టింది. ఈ ఘర్షణల్లో 300 మంది విద్యార్థులు మరణించారు. వీరిలో చాలా మంది వివిధ విశ్వవిద్యాలయాలకు చెందినవారు. దీంతో హసీనా పదవికి రాజీనామా చేసి భారత్‌కు వెళ్లిపోయారు. నహిద్, ఇతర విద్యార్థి నాయకులు ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్‌తో భేటీ కానున్నారు. ఈ విద్యార్థుల బఅందం సైన్యం లేదా ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని అంగీకరించడంలేదు. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనిస్ చీఫ్ అడ్వైజర్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. విద్యార్థి ఉద్యమం ఆమోదం లేని ఏ ప్రభుత్వాన్ని అంగీకరించబోమని నహిద్ ఫేస్‌బుక్ పోస్టులో పేర్కొన్నాడు. తన సోదరుడి గురించి నఖిబ్ చెబుతూ "అతడు ఎప్పుడూ దేశంలో మార్పు రావాలని ఆకాంక్షించేవాడు. అతడిని పోలీసులు అరెస్టు చేసి.. స్పృహ తప్పేలా హింసించారు. ఆ తర్వాత రోడ్డుపై పారేశారు. అయినా భయపడకుండా పోరాటాన్ని కొనసాగించాడు" అని పేర్కొన్నాడు.

## షేక్ హసీనాకు సాయం చేస్తామని హామీ ఇచ్చాం : విదేశీ వ్యవహారాల మంత్రి



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు సాయం చేస్తామని భారత్ హామీ ఇచ్చిందని అఖిలపక్ష సమావేశంలో విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జయ శంకర తెలిపారు. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, డిఎంకె నేత టి.ఆర్. బాలు, ఎన్‌సిపి నేత సుప్రియా సూలె తదితరులు హాజరయ్యారు. 'బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఈ రోజు పార్లమెంటులో జరిగిన అఖిలపక్ష సమావేశానికి వివరించాం. ఏకగ్రీవంగా మద్దతు తెలిపినందుకు వారికి కృతజ్ఞతలు" అని జయశంకర ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బంగ్లాదేశ్ పరిస్థితిపై ప్రభుత్వం అఖిలపక్ష సమావేశానికి వివరించిందని కాంగ్రెస్ నేత కార్తి చిదంబరం తెలిపారు. జాతీయ భద్రత, ప్రయోజనాలకు సంబంధించినంతవరకు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ప్రభుత్వానికి మద్దతుగా ఉందని ఆయన మీడియాకు తెలిపారు. అయితే తాను ఈ సమావేశానికి హాజరుకాలేదని అన్నారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉద్రిక్తమవడంతో హసీనా సోమవారం బంగ్లాదేశ్ నుండి భారత్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించుకునేందుకు ఆమెకు కొంత సమయం ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ దేశంలో ఉన్న 10,000 మంది భారతీయ విద్యార్థుల భద్రత దృష్ట్యా బంగ్లాదేశ్ ఆర్మీతో సంప్రదింపులు జరుపుతున్నట్లు రాజ్యసభలో జయశంకర పేర్కొన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

# పార్లమెంట్ రద్దు ..




**ఢాకా (జర్నలిస్ట్ ఫైల్) :** బంగ్లాదేశ్ పార్లమెంట్‌ను మంగళవారం రద్దు చేసినట్లు పార్లమెంట్ కార్యాలయం జాతీయ మీడియాకు తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటల కల్లా పార్లమెంటను రద్దు చేయాల్సిందిగా విద్యార్థి ఉద్యమ నిర్వాహకులు అల్టిమేటం జారీ చేసినట్లు పేర్కొంది. అలాగే వీలైనంత త్వరగా నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నాయకత్వంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు విద్యార్థులు అంగీకరించారు. పార్లమెంట్‌ను రద్దు చేస్తున్నట్లు అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ మంగళవారం ప్రకటించారు. దీంతో దేశంలో త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఆర్మీ, నేవీ, వైమానిక దళాల అధ్యక్షులు, ప్రతిపక్ష పార్టీల నేతలు, విద్యార్థి సంఘాల నేతలతో అధ్యక్షుడు షహబుద్దీన్ చర్చలు జరిపారు. అనంతరం ఈ ఏడాది జనవరిలో ఎన్నికైన పార్లమెంట్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారని అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఛైర్‌పర్సన్, మాజీ ప్రధాని ఖలీదా జియా కూడా జైలు నుంచి విడుదలైనట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థుల శాంతియుత నిరసనలు జాతీయ ఉద్యమంగా మారడంతో సోమవారం బంగ్లాదేశ్ 'ఉక్కుమహిళ'గా పేరుపొందిన షేక్ హసీనా ప్రధాని పదవికి రాజీనామా చేసి, దేశాన్ని విడిచి పారిపోయిన సంగతి తెలిసిందే.

**కోటాను వ్యతిరేకిస్తూ విద్యార్థుల నిరసనలు**

1971 స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం కోటా ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసనకారులు తెలిపారు. నెలరోజులకు పైగా జరిగిన ఈ నిరసనల్లో 300 మందికి పైగా మరణించారు.

**షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూలదోసిన నిరసనలు**

జులై 1 : రహదారుల దిగ్బంధనం

కోటాను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు బారికేడ్లతో రహదారులను, రైల్వేలైన్‌లను దిగ్బంధించారు. హసీనా పాలక పార్టీ అవామీ లీగ్‌కు చెందిన మద్దతుదారులకు ఉద్యోగాలు అప్పగించేందుకు ఈ పథకాన్ని రూపొందించారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.

జులై 16: హింసాత్మక ఘటనలు

ఆందోళనకారులకు, ప్రభుత్వ అనుకూల మద్దతుదారుల మధ్య ఘర్షణలు హింసాత్మకంగా మారింది. ఇరు వర్గాలు కర్రలు, ఇటుకలతో దాడి చేసుకున్నారు. హింసాత్మక దాడుల్లో ఆరుగురు మరణించారు. దీంతో దేశవ్యాప్తంగా పాఠశాలలు, యూనివర్శిటీలను మూసివేయాల్సిందిగా హసీనా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

జులై 18 పిఎంను తిరస్కరించడం

విద్యార్థులు శాంతియుతంగా ఉండాలని, నిరసనలలో ప్రతి హత్యకు శిక్ష ఉంటుందని హసీనా ప్రతిజ్ఞ చేశారు. హసీనా ప్రతిజ్ఞను విద్యార్థులు తిరస్కరించారు. నియంతృత్వానికి దిగజారారు అని నినాదాలు చేస్తూ బంగ్లాదేశ్ అధికారిక మీడియా సహా పలు ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధించారు.

దీంతో ప్రభుత్వం ఇంటర్నెట్‌పై నిషేధం విధించింది. ప్రభుత్వం కర్ఫ్యూ విధించడంతో పాటు సైన్యాన్ని మోహరించింది. సుమారు 32 మంది మరణించగా, వందలాది మంది గాయపడ్డారు.

జులై 21 : సుప్రీంకోర్టు తీర్పు

ఉద్యోగ కోటాలను తిరిగి ప్రవేశపెట్టే నిర్ణయాన్ని చట్టవిరుద్ధమని తీర్పునిచ్చింది. కానీ స్వాతంత్ర్య సమరయోధుల పిల్లలకు రిజర్వ్ చేసిన ఉద్యోగాలను పూర్తిగా రద్దు చేయాలనే నిరసనకారుల డిమాండ్ల కన్నా తక్కువగా ఉందని అన్నారు. సుప్రీంకోర్టు హసీనా ప్రభుత్వానికి రబ్బరు స్టాంప్‌గా మారిందని విమర్శించారు.

ఆగస్ట్ 5 : దేశాన్ని విడిచి పారిపోయిన హసీనా

వేలాది మంది నిరసనకారులు తన అధికారిక భవనం గనభబన్‌ను చుట్టుముట్టడంతో ఆమె హెలికాప్టర్‌లో దేశాన్ని విడిచి పారిపోయారు.

# కొండెక్కిన కోడిగుడ్డు ధర



**హైదరాబాద్,(జర్నలిస్ట్ ఫైల్) :** కోడి గుడ్డు ధర కొండెక్కింది. దీంతో సామాన్యులు కొనాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ పక్క బహిరంగ మార్కెట్లో కూరగాయలు ధరలు మండిపోతుంటే కోడి గుడ్ల ధరలు సైతం అందనంత ఎత్తుకు చేరుకున్నాయని ప్రజలు వాపోతున్నారు. గత ఏప్రిల్‌లో రూ.4 నుండి రూ.4.50 వరకు పలికిన కోడ్డి గుడ్ల ధరలు, మే నెలలో రూ.5, 5.50కు చేరాయి. ఇక జూన్, జూలై నెలల్లో అంతకంతకూ పెరుగుతూ కొద్ది రోజుల్లోనే రూ.6.00, రూ.6.50కు చేరుకోవడంతో వినియోగదారులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు మారుమూల పల్లెల్లో చిల్లరగా అయితే కోడి గుడ్లు రూ.7.50 వరకు విక్రయిస్తున్నట్లు గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. ఎంతో కాలంగా చికెన్, మటన్ ధరలు మండుతుండటంతో, పలువురు మాంసాహారులు కోడి గుడ్లతో సరిపెట్టుకుంటున్నారు. అయితే ప్రస్తుతం కోడి గుడ్ల ధరలు కూడా అమాంతం పెరగడంతో వారికి దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. మార్కెట్లో కోడి గుడ్ల వినియోగం భారీగా పెరిగింది. సాయంత్రం అయితే చాలు తోపుడు బండ్లపై ఆమ్లెట్లు, న్యూడిల్స్ తదితర ఫాస్ట్ ఫుడ్‌లో గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. వినియోగానికి తగినంత ఉత్పత్తి పెరగకపోవడంతోనే గుడ్ల ధరలు పెరుగుతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో ప్రతి రోజూ లక్షకు పైగా కోడి గుడ్ల వినియోగం జరుగుతున్నట్లు వ్యాపార వర్గాల అంచనా. జిల్లాకు అత్యధికంగా మహబూబ్‌నగర్, హైదరాబాద్, బెంగళూరు నుంచి గుడ్లు దిగుమతి జరుగుతుంది. వర్షాకాలం ప్రారంభమైనందున గుడ్ల ధరలు త్వరలోనే తగ్గే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

# తెలంగాణలో రెండు రోజులు భారీ వర్షాలు... ఆ ప్రాంతాలకు ఎల్లో అలర్ట్



**హైదరాబాద్,(జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న మూడు రోజుల్లో పలుచోట్ల గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో స్థిరమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.

ఈరోజు, రేపు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, నాగర కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

బుధవారం నుంచి గురువారం వం-కు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లోనూ పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముందని తెలిపింది.

# తెలంగాణా వార్తలు

## బెయిల్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్న కవిత

**హైదరాబాద్, (జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టులో దాఖలు చేసిన డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఎంఎల్సీ కవిత వెనక్కి తీసుకున్నారు. లిక్కర్ పాలసీ స్కామ్‌కు సంబంధించి సీబీఐ కేసులో ఆమె బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. నిన్న సీనియర్ న్యాయవాది కోర్టుకు హాజరుకాకపోవడంతో విచారణ వాయిదా వేయాలని ఆమె తరఫు లాయర్ కోరారు. పదే పదే వాయిదాలు కోరడంతో జడ్జి అసహనం వ్యక్తం చేశారు. వాదనలు వినిపించకపోతే పిటిషన్ విత్‌డ్రా చేసుకోవాలని సూచించారు. దీంతో కవిత డిఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు.

## నాగార్జున సాగర్ లో లేవల్ కాలువకు గండి

**నల్గొండ (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ కు భారీగా వరద వస్తుండటంతో అధికారులు సాగర్ గేట్లతో పాటు కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి భారీగా పెరగడంతో అనుములు మండలం మారెపల్లి వద్ద భారీ గండి పడటంతో కాలువలోని నీరు పొలాల్లోకి భారీ ఎత్తున చేరుకున్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారుల వెంటనే ఎడమ కాలువను మూసి వేసినట్లు తెలిపారు. అలాగే గండి పడిన ప్రదేశానికి చేరుకుని పూడిక పనులు ప్రారంభించినట్లు తెలుస్తుంది. కాగా ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 15మంది ఎస్.ఆర్.జి.ఈ.సి. అధ్యాపకులకు పి.హెచ్.డి పట్టాలు

**కృష్ణా (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకులు రాష్ట్ర, రాష్ట్రేతర విశ్వవిద్యాలయాల నుండి వివిధ సామాజిక స్పృహ కలిగిన అంశాలపై పరిశోధనలు చేసి సత్ఫలితాలు పొందినందుకు పి. హెచ్.డి. పట్టాలు పొందారు. డాక్టర్ గరిమెళ్ళ భారతి (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం) (జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాకినాడ నుండి) ఎస్.ఆర్.జి.ఈ.సి. ప్రొఫెసర్ డా.జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి.ప్రసాద్ గైడ్ గా , జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఏం.హెచ్.కఅష్ణ ప్రసాద్ కో గైడ్ గా, గుండిగ రాజా కుమార్ (ఆంగ్ల విభాగం) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి ఆ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ప్రొఫెసర్ డాక్టర్ బి.కరుణ సూపర్వైజర్ గా, వి.ఫణి కుమార్ (సివిల్ విభాగం) వేంకటేశ్వర యూనివర్సిటి, తిరుపతి నుండి సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.సి. హెచ్ సుధారాణి గైడు గా, షేక్ అబ్దుల్ మతిన్ (రసాయన శాస్త్రం) కఅష్ణా విశ్వవిద్యాలయం నుండి పి.బి.సిద్ధార్థ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డా.డేవిడ్ రాజు గైడ్ గా కఅష్ణా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.డి.రామశేఖర్ రెడ్డి కో గైడ్ గా, బి.శ్రీనువాసు కుమార్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం) అన్నామలై విశ్వవిద్యాలయం నుండి ఆ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.జి.శాంతి సూపర్వైజర్ గా ఎస్.ఆర్.జి.ఈ.సి. నుండి ఏ. ఐ డి.ఎస్. విభాగాధిపతి డా.ఎస్.నారాయణ కో గైడు గా, పి.అశోక్ రెడ్డి (ఏ.ఐ, డి.ఎస్. విభాగం) అన్నామలై యూనివర్సిటీ నుండి డా. ఆర్ సత్యా సూపర్ వైజర్, ఎస్.ఆర్.జి.ఈ.సి. ఏ. ఐ, డి.ఎస్. విభాగాధిపతి డా.ఎస్.నారాయణ కో సూపర్ వైజర్ గా, తెనాలి నాగమణి



(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు నుండి ఆర్.వి.ఆర్, జె.సి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ , ప్రొఫెసర్ అండ్, ఏ.ఐ.ఏం.ఎల్. విభాగాధిపతి డా.డి.రామ మోహన్ బాబు సూపర్వైజర్ గా, పి.తేజోమూర్తి (మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం) జవహర్ లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయం నుండి లక్కిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డా.కె.దిలీప్ కుమార్ సూపర్వైజర్ గా, జె.ఎన్.టి.యు. ప్రొఫెసర్ డా.బి. బాలకఅష్ణ కో సూపర్వైజర్ గా, ఎస్.భవాని (ఈ.సి.ఈ. విభాగం) పాండిచ్చేరి కేంద్రీయ విశ్వవిద్యాలయం నుండి ఆ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.టి.షణ్ముగానందం సూపర్వైజర్ గా, కె.పఅధ్వీరాజ్ (ఎం.బి.ఏ. విభాగం) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి ఆ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.టి.ప్రసన్న కుమార్ సూపర్వైజర్ గా, టి.హేమంత్ కుమార్ (ఎం.బి.ఏ. విభాగం) ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఆ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.ఏ.నరసింహ రావు రీసెర్చ్ గైడ్ గా, బి.నాగ శిరీష (ఈ.సి.ఈ. విభాగం) జె.ఎన్.టి.యు.కె. నుండి శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ డా.వి.వి.కె.డి.వి. ప్రసాద్ సూపర్వైజర్ గా, పి ఆంజనేయ బాబు (సివిల్ ఇంజనీరింగ్ విభాగం )గీతం యూనివర్సిటీ, విశాఖపట్నం నుండి సివిల్ ఇంజనీరింగ్ విభాగ ప్రొఫెసర్ డా.కె.వి.రమేష్‌గైడు గా, శ్రీ బి.వంశీ కఅష్ణ (ఈ.సి.ఈ. విభాగం)కె.ఎల్ యూనివర్సిటి గుంటూర్ నుండి ఆ విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఫాజల్ నూర్ బాష గైడ్ గా మరియు ఎస్.ఆర్.ఏం.యూనివర్సిటి (ఏ.పి) అసోసియేట్ ప్రొఫెస్సర్ డా.ఏం.దుర్గా ప్రకాష్ కో గైడు గా , శ్రీమతి ఏ.అపర్ణ ( సి.ఎస్.ఈ. విభాగం) అన్నామలై యూనివర్సిటీ, చిదంబరం నుండి సి.ఎస్.ఈ విభాగం ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి డా.ఆర్. భవాని మరియు ఎస్.ఆర్.జి.ఈ.సి. ఇన్ఫర్ మేషన్ టెక్నాలజీ ప్రొఫెసర్ డా.సిహెచ్.కవితా కొ గైడ్ గా పరిశోధనలు చేసి పి. హెచ్.డి. పట్టాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు.

గత ఆరు నెలల వ్యవధిలో కళాశాల అధ్యాపకులు పదిహేను మంది వివిధ విభాగాల్లో పి. హెచ్.డి.పట్టాలు పొందటం గమనార్హం. వీరు తమ పరిశోధనా కాలంలో వివిధ జాతీయ మరియు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గని అనేక పరిశోధనా పత్రాలను సమర్పించి ప్రచురణ గావించారు. ఉద్యోగంలో తమ విధులు నిర్వహిస్తూనే, శ్రమించి పట్టుదలతో డాక్టరేట్ డిగ్రీలు పొందిన అధ్యాపకులను కళాశాల యాజమాన్య సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి.రవీంద్ర బాబు, డైరెక్టర్స్ డాక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి.ప్రసాద్, డాక్టర్ ఎం.కామరాజు, డాక్టర్ పార్థసారథి రామానుజం, బి.ఎస్. అండ్ హెచ్. విభాగాధిపతి డాక్టర్ ఎస్.సురేష్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. ఏ.హెచ్.ఎల్.స్వరూప్ , మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కె.సి.హెచ్. కిషోర్ కుమార్, ఈ.సి.ఈ. విభాగాధిపతి డాక్టర్ బి.రాజ శేఖర్,సి.ఎస్.ఈ విభాగాధిపతి డా.ఎం.బాబు రావు, ఐ.టి. విభాగాధిపతి డాక్టర్ డి.ఎన్.వి.ఎస్.ఎల్.ఎస్. ఇందిర, ఏ.ఐ, డి.ఎస్.విభాగాధిపతి డా.ఎస్.నారాయణ , ఎం.బి.ఏ. విభాగాధిపతి డాక్టర్ జి.కమల్, వివిధ విభాగాధిపతులు, మెంటర్స్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేలిన గ్యాస్ సిలిండర్.. ముగ్గురికి తీవ్రగాయాలు



**తాడేపల్లి గూడెం (జర్నలిస్టు ఫైల్):** పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ప్రమాదం జరిగింది. గ్యాస్ సిలిండర్ పేలి భార్యభర్తలతోపాటు మరో యువతికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానిక టిడ్కో గృహ సముదాయంలోని సీ బ్లాక్‌లో బాధిత కుటుంబం నివసిస్తోంది. ఉదయం వంట చేస్తుండగా.. ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలిపోయి, ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో మురళి, ఆయన భార్య కుమారితో పాటు మరో యువతికి తీవ్రంగా గాయాలయ్యాయి. అరుపులు విన్న స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై తాడేపల్లి గూడెం గ్రామీణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల ధర్నా



**చిత్తూరు (జర్నలిస్టు ఫైల్):** సంక్షేమ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా కలెక్టరేట్ వద్ద విద్యార్థులు ధర్నా చేపట్టారు. సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

# యువతి అదృశ్యం




**కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్):** యువతి అదృశ్యమైన ఘటన యు.కొత్తపల్లిలోని అమరవిల్లి గ్రామంలో జరిగింది. అమరవిల్లి గ్రామానికి చెందిన వాకా లలిత (25) అనే యువతి గత రెండు రోజుల నుండి కనబడటం లేదని తొండంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బంధువులు తెలిపారు. తొండంగి మండలం జిఎం పేట గ్రామంలోని సచివాలయం లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గా ఉద్యోగం చేస్తున్న లలితకు అదే గ్రామానికి చెందిన వ్యక్తితో లలిత తండ్రి వివాహం చేసేందుకు నిశ్చయించారు. ఈక్రమంలో వివాహానికి సంబంధించి మాటలు జరుగుతుండగా, ఉద్యోగానికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబీకులు తెలిపారు. దీనిపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.

# హాస్పిటల్ సిబ్బంది నిర్లక్ష్యంతో బాలింత మృతి



**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారు జామున ఏలూరు జిల్లా టి.నరసాపురంలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వగ్గాల అలివేలు (23) జూలైలో బాబుకు జన్మనిచింది. ఆగష్టు 5న సోమవారం ఆసుపత్రి నుంచి ఇంటికి డిశ్చార్జి అయ్యి ఇంటికి చేరుకుంది. రాత్రి సమయంలో బాబుకు పాలు ఇస్తూ ఆకస్మాతుగా కిందపడింది. దీంతో కుటుంబ సభ్యులు సమీపంలోని టి.నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించడంతో అలివేలు మృతి చెందింది. అలివేలు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకులు మృతదేహంతో ఆసుపత్రి వద్ద ధర్నా చేపట్టారు.

# పునరావాస కేంద్రంలో పాము కరిచి గిరిజన వృద్ధుడు మృతి




**అల్లూరి (జర్నలిస్ట్ ఫైల్):** పునరావాస కేంద్రంలో పాము కరిచి గిరిజన వృద్ధుడు మృతి చెందిన విషాద ఘటన చింతూరులో జరిగింది. వరదల కారణంగా బాధితులు చింతూరు మండలంలోని పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు. ఈక్రమంలో పునరావాస కేంద్రంలో ఉన్న ఏజి .కోడేరు గ్రామానికి చెందిన మోసం.తమ్మయ్య (76) అనే వృద్ధుడిని పాము కరిచింది. దీంతో వెంటనే తమ్మయ్యను చింతూరు గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మరణించారు.

# ముంపు గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటన

**అల్లూరి (జర్నలిస్టు ఫైల్):** ఇటీవల గోదావరి వరదల వల్ల ముంపుకు గురైన గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించింది. కోటారి గొమ్ము, జీడిగుప్ప, సీతంపేట, శ్రీరామ్ గిరి, ముల్కనపల్లి, చొక్కానపల్లి, గ్రామాల్లో మంగళవారం ఎంపీపీ కారం లక్ష్మితో, సిపిఎం బృందం పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం నాయకులు మాట్లాడుతూ.. వరదలకు ముంపునకు గురైన గ్రామాల్లోని డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, కాళ్ల వాపులతో అనేక మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఇద్దరు, ముగ్గురు మరణించారని.. తక్షణమే వైద్య అధికారులు స్పందించి సహాయ సహాయక చర్యలు చేపట్టాలని హెల్త్ క్యాంపులు తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. వరదలతో పూర్తిగా పడిపోయిన గృహాలకు రెండు లక్షల రూపాయలు పరిహారం, సగం దెబ్బ తిన్న గృహాలకు లక్ష రూపాయలు చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు.



కోటార్ గొమ్ములో పాటు అనేక మండలాల్లో ఉపాధ్యాయులు కొరత చాలా ఎక్కువగా ఉందని తక్షణమే అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం.సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం.చిన్నబాబు, మండల నాయకులు కారం.సుందరయ్య, సోడి.మల్లయ్య కాంతారావు, జి.లక్ష్మణరావు, తాత బాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# యోగ ఇన్ స్ట్రక్షన్ పుస్తకావిష్కరణ చేసిన వీసీ గంగాధరరావు


**ఏఎన్యూ(జర్నలిస్ట్ ఫైల్):** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విద్య క్రీడా శాస్త్రాల కళాశాలలోని యోగ విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ కాశీభట్ట సత్యమూర్తి రచించిన యోగ ఇన్ స్ట్రక్షన్ అనే పుస్తకాన్ని మంగళవారం విశ్వవిద్యాలయ ఇన్చార్జి వైస్ ఛాన్స లర్ ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత సత్యమూర్తిని అభినందించారు. యోగ విద్యకు రోజురోజుకు ఆదరణ పెరుగుతున్న కారణంగా యోగ ఇన్ స్ట్రక్చర్స్ యోగాలో శిక్షణ ఇవ్వడం అనే ధోరణి విస్తరిస్తుందన్నారు. అయితే ఇది కేవలం శారీరక వ్యాయామం లాగా కాకుండా దేహము మనస్సు సమన్వయాన్ని సాదించేలా విద్యార్థులు యోగ అభ్యసించాలనేది అధ్యాపకులు సూచిస్తూ ఉంటారన్నారు. యోగా ఇన్ స్ట్రక్షన్ అనే పుస్తకం అధ్యాపకులకు ఒక టీచింగ్ మాన్యువల్ గా ఉపకరించగలదని పేర్కొన్నారు. తరగతి గదిలో



బోధన తోపాటు ప్రాక్టికల్స్ విషయంలో తీసుకోవలసిన పలు సాంకేతికమైన జాగ్రత్తలు ఇందులో పొందుపరచడం గమనార్హమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ రెక్టార్ ప్రొఫెసర్ కె. రత్న షీలా మణి, ఇన్ చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. వెంకటేశ్వర్లు, వ్యాయామ కళాశాల యోగ కోఆర్డినేటర్ డాక్టర్ డి . సూర్యనారాయణ అధ్యాపకులు ఏ. రాధిక, కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎంవి. రమణ తదితరులు పాల్గొన్నారు.

# నేను తప్పు చేయలేదు నాన్నా

**డోన్, (జర్నలిస్ట్ ఫైల్):** రక్త సంబంధంతోనే బాంధవ్యం ఉండదని, అనురాగంతోనూ బంధాలు ముడివడతాయని నిరూపించలేని ఓ యువతి నిస్సహాయురాలైంది. తాను అన్నగా భావించి పంచిన అనురాగాన్ని అపార్థం చేసుకున్న తండ్రి మందలించటంతో మనస్తాపానికి గురై బలవన్మరణం చెందింది. కృష్ణగిరి మండలానికి చెందిన జక్కి గౌరప్ప, రామేశ్వరి దంపతులు డోన్‌లో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి. పెద్ద కుమార్తె రేణుక యల్లమ్మ (22) మాచర్లలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఈసీ రెండో సంవత్సరం చదువుతోంది. వేసవి సెలవులు ముగించుకొని ఇటీవల కళాశాలకు



తిరిగివెళ్లారు. ఆమెను చెల్లెలిగా చూసుకొనే ఓ అబ్బాయి ఆదివారం సాయంత్రం ఫోన్ చేశారు.. ఆ సమయంలో ఆమె పనిలో ఉండి స్పందించలేదు.. రేణుక ఫోన్ తీయడం లేదని ఆ అబ్బాయి ఆమె తండ్రి గౌరప్పకు ఫోన్ చేసి చెప్పారు. ఆగ్రహానికి గురైన ఆయన కుమార్తెకు ఫోన్ చేసి మందలించారు. కళాశాలలో చదువుకునే అమ్మాయిలకు అబ్బాయిలతో పనేంటి ? అతనెందుకు ఫోన్ చేస్తున్నారు..? ఈ విషయాన్ని కళాశాలలో తేలుస్తానంటూ ఊగిపోయారు. రేణుక ఎంత చెప్పినా తండ్రి వినలేదు.. సోమవారం తెల్లవారేసరికి కళాశాలకు వస్తాననటంతో ఆమె భయపడింది. తండ్రి వస్తే జరిగే పరిణామాలను ఊహించుకుంటూ తన మరణంతోనే సమస్య తీరుతుందని భావించి.. తాను ఏ తప్పు చేయలేదని ఉత్తరం రాసి వసతి గృహంలో ఖాళీగా ఉన్న గదిలో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి గౌరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# వైకాపా ఎమ్మెల్సీ భరత్‌పై కేసు నమోదు



**అరండల్‌పేట (జర్నలిస్ట్ ఫైల్):** వైకాపా ఎమ్మెల్సీ భరత్‌పై కేసు నమోదైంది. తిరుమలలో తోమాల సేవ పేరిట సిఫారసు లేఖ విక్రయించినట్లు గుంటూరులోని అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు అందింది. సిఫారసు లేఖల అమ్మకంపై తెదేపా నేత చిట్టిబాబు ఫిర్యాదు చేశారు. గుంటూరు వాసుల నుంచి రూ. 3లక్షలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో ఎమ్మెల్సీ భరత్‌తో పాటు ఆయన పీఆర్వో మల్లికార్జునపైనా కేసు నమోదైంది. శాసనసభ ఎన్నికల్లో కుప్పం నుంచి సీఎం చంద్రబాబుపై భరత్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

# విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల




**విశాఖ (జర్నలిస్టు ఫైల్):** విశాఖ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. నేటి నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 13 వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుంది. ఇక ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 30న పోలింగ్.. సెప్టెంబర్ 3న ఫలితాలు విడుదల చేయనున్నారు. కాగా ఎమ్మెల్సీ ఉపఎన్నికలో మొత్తం ఓటర్లు 838 మంది ఉన్నారని అధికారులు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# తెరుచుకున్న పులిచింతల ప్రాజెక్టు గేట్లు



**● 26,083 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల**

**పులిచింతల (జర్నలిస్ట్ ఫైల్):** ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల కారణంగా కృష్ణా నదికి వరద నీరు చేరుతుంది. నిన్న సాగర్ గేట్లు ఎత్తి దిగువకు లక్షన్నర క్యూసెక్కులకు పైగా నీరు విడుదల చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో పులిచింతల ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ప్రాజెక్టులో నీటి నిల్వ పెద్దగా లేకపోయినప్పటికీ భారీ వరద దృష్ట్యా అధికారులు గేట్లు ఎత్తారు. ఎగువ నుండి పులిచింతలకు 30,388 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా.. నాలుగు గేట్లు ఎత్తిన అధికారులు 26,083 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# సౌదీలో నరకయాతన పడుతున్నమరో మహిళ

**● నరకయాతన పడలేను ఎలాగైనా దేశానికి రప్పించండి ● నిమ్మనపల్లెకు చెందిన వివాహిత వేడుకోలు ● భార్యను తిరిగి రప్పించాలంటున్న భర్త, ఇద్దరు పిల్లలు**

**అన్నమయ్యజిల్లా (జర్నలిస్ట్ ఫైల్):** సొంత ఊరిలో బ్రతుకు ఈడ్చలేక విదేశాలకు వెళ్లి డబ్బు సంపాదించుకొని వస్తానని గుండె నిండా ఆశతో వెళ్లిన ఓ వివాహిత వెట్టిచాకిరి చేయలేక, నరకయాతన పడలేనంటూ ఇంటికి వచ్చేస్తానని.. ఏడుస్తూ సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేసిన వీడియో పలువురిని కలచివేస్తూ కంటతడి పెట్టిస్తుంది.. నిమ్మనపల్లె పంచాయతీ తురకపల్లెకు చెందిన హసీనాబి (26)కు స్థానికుడైన హసన్ వల్లితో 9 సంవత్సరాల క్రితం వివాహమైంది. దంపతులిద్దరికీ అబ్దుల్ అజీజ్ (8), అబ్దుల్ వాజిద్ (6) అను ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త హసన్ వల్లి ఎలక్ట్రిషన్ పనులు చేస్తుండగా, భార్య హసీనాబీ కూలి పనులకు వెళుతుండేది. ఈ క్రమంలో తమ బంధువైన సహారా బాను (వదిన) కొంతకాలం క్రితం సౌదీ అరేబియాకు ఉపాధి కోసం వెళ్ళింది. ఈ క్రమంలో హసీనాబీకి వీసా పంపుతానని, నువ్వు కూడా వచ్చి డబ్బు సంపాదించుకోవచ్చని



చెప్పిందన్నారు. సహారా బాను చెప్పిన మాటలతో ఏకీభవించి అక్కడికి వెళితే డబ్బులు సంపాదించుకోవచ్చన్న ఆశతో, భర్త, కుటుంబ సభ్యుల అనుమతితో జూలై 12వ తేదీన రాయచోటిలోని ఓ ఏజెంట్ సహాయంతో సహారాబాను పంపిన వీసాపై సౌదీ అరేబియాలోని రియాద్ కు చేరుకుంది. అక్కడ నాలుగు రోజుల పాటు వదిన సహారాబాను తో ఉన్న హసీనాబీ తరువాత వీసా పొందిన ఇంటికి పనికి వెళ్ళింది. అయితే..ఇక్కడే ఆమెకు అనుకోని కష్టాలు మొదలయ్యాయి వీసా పొందిన ఇంటిలో ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఉండగా మూడు బెడ్ రూములు, రెండు బాత్ రూములు, ఒక హాలు, ఒక కిచెన్ తో కూడిన అతిపెద్ద ఇంటిలో పని చేయడం హసీనాబీకి కష్టంగా మారింది. పైగా ఆమె ఒక్కటే ఆ ఇంటిలో పనిమనిషి. అంతేకాకుండా ఉదయం 9 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము వరకు ఆ ఇంటిలో ఏకధాటిగా పనులు చేయాల్సి వచ్చింది. కేవలం రెండు మూడు గంటల విశ్రాంతితో పనులు చేయలేక అలసిపోయినా, ఆ ఇంటి యజమాని వేధింపులు మాత్రం ఆగలేదు. కనీసం మూడు పూటలా తిండి పెట్టకపోవడంతో అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. భర్త, పిల్లలను పోషించుకోవడానికి బ్రతుకుతెరువుకు వచ్చి బ్రతకలేక ఇక్కడే చచ్చిపోతానేమోనని భయపడింది. ఇక చేసేది లేక వెనక్కు వెళ్లి కూలీ నాలి చేసుకుని బ్రతుకుదామని భావించి తనని స్వదేశానికి రప్పించాల్సిందిగా వేడుకుంటూ వీడియోను కుటుంబ సభ్యులకు పంపింది. ఆ వీడియో కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె కష్టాన్ని విన్న ప్రతి ఒక్కరు చలించిపోతున్నారు. ఆమెను స్వదేశానికి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం తగు చర్యలు వెంటనే తీసుకోవాలని భర్త హసన్ వల్లి వేడుకుంటున్నారు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష ఈ విషయమై తనతో మాట్లాడారని హసీనాబీని సౌదీ అరేబియా నుంచి స్వదేశానికి రప్పించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని అన్నారు. ఏది ఏమైనా బాధితురాలు హసీనాబీని ప్రభుత్వం వెంటనే స్వదేశానికి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## దువ్వూరు గ్రామంలో శునకాల బెడద...

సంగం, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :** సంగం మండలం,దువ్వూరు గ్రామంలో కుక్కలు చుక్కలు చూపిస్తున్నాయి అంటూ ప్రజల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. శునకాల బెడదతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.ఎక్కువగా ఇటీవల కాలంలో పిల్లలు స్కూల్ కి వెళ్లాలంటే,ఆడవాళ్లు బయటికి రావాలంటే భయందోళన చెందుతున్నారు.దువ్వూరు గ్రామంలో అధికారులు వెంటనే చర్యలు తీసుకుని, శునకాలను పట్టి దూరంగా అటవీలో వదిలేయాలని స్థానికులు కోరుతున్నారు.

## చేజర్ల నూతన తహసిల్దారుగా రమణారావు

చేజర్ల, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :** చేజర్ల నూతన తహసీల్దారుగా ఏవి రమణారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పల్నాడు జిల్లా,నుండి తహసీల్దారుగా పని చేస్తూ ఇక్కడకు వచ్చారు.ఆయనకు అధికారులు,సిబ్బంది, స్వాగతం పలికారు.ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ,మండలంలో రెవిన్యూ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## 34వ డివిజన్లో విద్యుత్ సమస్యకు పరిష్కారం:: సాబీర్ ఖాన్

నెల్లూరు,రూరల్, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి,కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిల ఆదేశాల మేరకు,34 డివి జన్,ప్రగతి నగర్ బి బ్లాక్ లో కొన్ని సంవత్సరాలుగా కరెంటు సమస్య ఉన్నందున, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చొరవతో ఎలక్ట్రిసిటీ అధికారులతో మాట్లాడి, ఆ సమస్యను నేటితో తొలగనుంది.ప్రగతి నగర్ బి బ్లాకు ఐదో వీధి ఆరో వీధిలో నూతన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుచేసి ప్రగతి నగర్ ప్రాంతంలో లోడు తగ్గించే దిశగా నేడు నూతన ట్రాన్స్ఫర్ ఏర్పాటు చేయడం జరిగినది.సోమవారం సాయంత్రానికి ఈ పనులు పూర్తవుతాయి.ఎలక్ట్రిసిటీ అధికారులతో లైన్ మాన్ తో ప్రత్యేకంగా ఈ పనులు తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబీర్ ఖాన్, 34 వార్డ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వల్లూరు మురళి, నబీ సాహెబ్, తదితరులు పర్యవేక్షించారు.

## 43వ డివిజన్లో జాఫర్ షరీఫ్ పర్యటన

నెల్లూరు,కార్పొరేషన్, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :** ఖాన్): నెల్లూరు నగరములోని స్థానిక 43వ డివిజన్లోని బారుత్ ఖాన్ వీధి, బడా మకాన్, కోటమిట్ట, జండా వీధి, పెద్ద బజార్ ఏరియాలాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్ షరీఫ్



పర్యవేక్షించడం జరిగింది.లోకల్ పెద్దలను కలిసి వారు ఉండే నివాస ప్రాంతాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకోవడం జరిగింది.వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్క సందులో నివాసాలు ఉన్నా వారు అక్కడ ఖాళీ ప్లాట్లో చెత్త వేస్తున్నారని, అలాగే అక్కడ దాని ప్రక్కన పాత బిల్డింగ్లో నుంచి నీరు వృధాగా పోతున్నాయని తెలపితే, అప్పుడే జాఫర్ షరీఫ్ అక్కడి ట్యాప్ ఇన్స్పెక్టర్ పిలిచి కనెక్షన్ డమ్మీ చేయించటం,ఖాళీస్థలములో చేత్తను తొలగించటం జరిగింది.ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ రబ్బానీ, యూత్ లీడర్ రబ్బానీ పాల్గొనటం జరిగినది.(3)

## రాపూరు తాహశీల్దారుగా శ్యాం సుందర్ రాజా

రాపూరు,రూరల్, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :**

రాపూరు నూతన తాహశీల్దారుగా శ్యాం సుందర్ రాజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఆయన గతంలో రాపూరు రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా,డిప్యూటీ తహశీల్దార్ గా పని చేసారు..అనంతరం తహశీల్దార్ గా పదోన్నతి పొందారు..ఎన్నికల నిమ్మితం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల తహశీల్దార్ గా వెళ్లి ఎన్నికల అనంతరం సొంత జిల్లా కు రావడంతో జిల్లా కలెక్టర్ రాపూరు తహసీల్దార్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో శ్యాం సుందర్ రాజా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి.. శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, పెండింగ్లో ఉన్న రెవెన్యూ సమస్యలపై దృష్టి సారిస్తానన్నారు. ప్రజలకు సత్వరమే సేవలందిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లు సునీల్,సురేఖ,సీనియర్ సహాయకులు హరి బాబు,ఆర్.ఐ సతీష్,మండలంలోని వీఆర్వోలు పాల్గొన్నారు.

## పూడికతీత పనులు వెంటనే ప్రారంభించాలి::బిజెపి డిమాండ్

నెల్లూరు,సిటి, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :** సాగునీటి కాలువలలో పూడికతీత పనులు వెంటనే ప్రారంభించాలని బిజెపి డిమాండ్ చేసింది.బిజెపి నమామీగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఓ లవన్నకు పంట కాలువలపై వినతిపత్రం సమర్పించారు. జలవనరుల శాఖ అధికారులు సంవత్సరానికి రూ.20 కోట్లు వ్యయం చేస్తున్న పంట కాలువలలో పూడిక అలానే ఉంటుందని,నిధులు దుర్వినియోగం అవుతున్నాయి తప్ప చివరి ఆయకట్టుకు నీరందే వాట్సాప్ పరిస్థితి జిల్లాలో లేవన్నారు.నెల్లూరు జిల్లాలో మేజర్ -మైనర్ చెరువులు 1100 ఉండగా, ఆ చెరువుల నుండి సాగునీటి పంట కాలువల ద్వారా చివరి వరకు నీరు ప్రవహించే పరిస్థితులు లేవన్నారు.ఐ.ఎ.బి.సమావేశాలలో నీరు విడుదల తేదీలు నిర్ణయించిన తర్వాత నీరు వదిలే సమయంలో కాలు వలలో పూడికతీత పనుల ప్రారంభిస్తున్నారు,మట్టిని తీసే సమయంలో నీరు ప్రవాహం వలన పూడిక తీయలేకపోతున్నారని అన్నారు.నెల్లూరు జిల్లాలో సోమశిల కండలేరు డ్యాముల్లో నీటి వనరులు లేవు, ఈ సమయంలో పంట కాలువలలో మట్టిని తొలగించినట్ల యితే నీటి దుర్వినియోగం లేకుండా చివరి ఆయకట్టుకు నిరందిం చేందుకు వీలు పడుతుంది.ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రమేష్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి,కంచర్ల నారాయణ యాదవ్,ఎం.రత్నం నాయుడు,ఏ.నాగేంద్ర సింగ్,కేశవ,మునిసురేష్,భాస్కర్ నారాయణరావు,తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పధంలో కోవూరు నియోజకవర్గం::కైలాసం



ఇందుకూరుపేట, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :** షేక్.ఖాజామొహిద్దీన్): నెల్లూరు జిల్లా, ఇందుకూరుపేట మండలం,కొత్తూరు గ్రామంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కైలాసం శ్రీనివాసరెడ్డి సోమవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నెల్లూరు జిల్లాలో ఎం.పీ.వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ క్రమంలో ఇందుకూరుపేట మండలంలో ప్రధానంగా ఉన్నటువంటి నీటి సమస్య వున్న పంచాయతీలు కుడితిపాలెం రాముడుపాలెం,గంగపట్నం, మైపాడు, కొరుటూరు కోస్తా తీర ప్రాంతాలలో నీటి ఎద్దడితో ప్రజలు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొం టున్న నేపథ్యంలో, ఆ సమస్యను పరిష్కరించే దిశగా బీజేపీ ముందడుగు వేస్తుందని,ఈ సమస్యపై స్థానిక కోవూరు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారాన్ని చూపుతామని చెప్పారు.అలాగే కుడితిపాలెం, గంగపట్నం, నర్సాపురం గ్రామాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా గత ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేసిందని వచ్చిన వినతుల మేరకు ఆయా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయుటకు ఎం.పి. ప్రభాకర్ రెడ్డి దృష్టికి, జిల్లా రెవిన్యూ అధికారులకు బీజేపీ తరపున వినతి పత్రాన్ని సమర్పించి, అర్హులైన వారికి కూడా ఇళ్ల స్థలాలను ఇప్పించేందుకు ప్రయత్నం చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మత్స్యకార సెల్ అధ్య క్షులు చెంచంగారి గాంధీ, బీజేపీ మండల ఉపాధ్యక్షులు నెల్లూరు శ్రీనివాసులు, చేవూరు వెంకట్రావు, కేతిరెడ్డి అవినాష్ రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు కోసూరు వెంకట రమణయ్య, బీజేపీ కార్యకర్తలు ఓ. మురళి, నక్కా వెంకట రమణయ్య శరత్, పవన్, ప్రసాద్, మురళి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.(5)

## కోవూరు నియోజకవర్గంలో డొనేషన్ల పేరుతో నిలువు దోపిడీ....

కోవూరు, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :**

నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలోని, బుచ్చిరెడ్డిపాలెం, కోవూరు పలుచోట్ల వీధులలో ఇండ్ల వద్దకు కొందరు మహిళలు ఓల్డ్ ఏజ్ హోములతో, అనాధ ఆశ్రయాలకు, డొనేషన్లు ఇవ్వండి, తోచిన సహాయం చేయండి అంటూ పాంప్లెట్లు చేత పట్టుకొని ఇళ్లలోకి జొరబడుతున్నారని స్థానికులు కొందరు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక ప్రజలు అంతిమ తీర్పు ప్రతినిధితో తెలిపిన వివరాల మేరకు వార్త ప్రసారం చేయడం జరిగి నది. స్థానిక ప్రజలు మహిళలను అడగగా, ఆశ్రయాలు విజయవాడలో ఉన్నాయి, మీరు ఇచ్చిన డబ్బులు వారికి మేము చేరుస్తాము అన్నారని వారన్నారు.అయితే ఇళ్ల లోకి నేరుగా రావడం తప్పు కదా అని ఆమెను మందలించారు.అసలు నిజమైన ట్రస్ట్ వారేనా అని అనుమానాలు వ్యక్తం చేశారు.ఆమెను గట్టిగా అడిగిన తర్వాత ఆమె ఇంకా ఎవరి ఇంటి వద్ద అడగకుండా నేరుగా బస్టాండు వైపు వెళ్లిపోయింది అన్నారు.ఇలాంటివారు తిరుగుతూ ఉండడం అసలు నిజమైన వారు ఎవరు అని అనుమానాలు వ్యక్తం అవుతూ ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు.మరి కొందరు మహిళలు చంటి బిడ్డను ఒడిలో కూర్చోబెట్టుకొని కార్ల వద్ద ప్రయాణికుల వద్ద బిక్షం ఎత్తుకోవడం పాలు తాగుటకు డబ్బులు అడగడం కొందరు మహిళలను అంతిమతీర్పు ప్రతినిధి వివరణ కోరగా, మహిళలు ఇచ్చిన సమాధానం వారి బిడ్డలు కాదని, తమ్ముడు బిడ్డ అన్న బిడ్డ అంటూ సాకులు చెబుతూ అక్కడినుంచి తప్పించుకున్నారని, అసలు వారి బిడ్డ అయితే ఇంతటి ఎండలో బొటన సంకలు వేసుకుని తిరుగుతారా,ఏ తల్లి అయినా అని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత అధికారులు, హ్యూమన్ రైట్స్ సమాచారం అందించి ఇలాంటి వారిపై దృష్టి పెట్టాలని కోరారు.

## కోచ్ ధనుష్ ఆధ్వర్యములో మూడు మెడల్స్



ముత్తుకూరు, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :** గౌస్ బాషా): ఇంటర్నేషనల్ శిలంబ(కర్ర సామి) ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ ఆదివారం తమిళనాడు రాష్ట్రంలోని తిరుచ్చి పట్టణం నేషనల్ కాలేజీలోని ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు.ఈ శిలంబ(కర్ర సామి) ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ శిలంబ వరల్డ్ ఫెడరేషన్ అధ్యక్షులు శంకర్ ఆధ్వర్యంలో జరిగింది.ఈశిలంబ(కర్ర సామి) ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ లో నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలానికి చెందిన సింహపురి కరాటే అకాడమీ కోచ్ కే ధనుష్ ఆధ్వర్యంలో మూడు మెడల్స్ సంపాదించారు.వి జ్యోతి 48 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ గెలుపొందింది. అలాగే 36 కేజీల విభాగంలో సిహెచ్ నాగ మౌనిక సిల్వర్ మెడల్, 28 కేజీల విభాగంలో కె సాహిత్య సిల్వర్ మెడల్ గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు తిరుచ్చి కలెక్టర్ డాక్టర్ సెంథిల్ కుమార్ ఐపీఎస్ చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులను అభినందనలు తెలియజేసి మరిన్ని మెడల్స్ గెలుపొందాలని ఆకాంక్షించారు. సింహపురి కరాటి అకాడమీ ఆధ్వర్యంలో ఎక్కడ పోటీల్లో పాల్గొన్న కచ్చితంగా విద్యార్థులు మెడల్స్ గెలుపొందుతున్నారు. ముత్తుకూరు మండలానికి కాకుండా నెల్లూరు జిల్లాకే సింహపురి కరాటి అకాడమీ విద్యార్థులు మంచి పేరు తీసుకొస్తున్నారని అక్కడున్న ప్రజలు కొనియాడుతున్నారు.అలాగే కోచ్ ధనుష్ ఆధ్వర్యంలో విద్యార్థులు మంచి ఫలితాలు తీసుకొస్తున్నారని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. మన విద్యార్థులు రాష్ట్రంలో కాకుండా దేశంలోనే అన్ని పోటీల్లో పాల్గొని మంచి మెడల్స్ సంపాదించాలని అందరూ ఆకాంక్షించింద్దాం.(9)

## తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యవంతం

గూడూరు, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :** తల్లి ముర్రుపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యవంతమని అంగన్వాడీ కార్యకర్త తెలిపారు. సోమవారం గూడూరు రెండో పట్టణ పరిధిలోని సీతమ్మ బడిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో తల్లులకు బిడ్డలకు ఇచ్చే ముర్రుపాలు ప్రాముఖ్యత గురించి వివరించారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా లాగా పని చేస్తుందన్నారు. ముర్రు పాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందని, ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వ వచ్చన్నారు. ఆడపిల్లలకు చదువు ముఖ్యమని ఆడపిల్లలను చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రాజేశ్వరి,సునీత,రమాదేవి,స్కూల్ టీచర్లు సుభాషిని, హైమావతి,సురేఖ,ఆశా వర్కర్లు,అంగన్వాడీ అయాలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 5వ తరగతి విద్యార్థి హెప్సిబా జన్మదినం

నెల్లూరు,విద్య, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :** నెల్లూరు నగరములోని స్థానిక కొండాయపాళెం నందుగల నగర పాలక ప్రాథమిక పాఠశాలలో 5 వ తరగతి విద్యార్థి హెప్సిబా జన్మదినం సందర్భంగా విద్యార్థులకు అరటి పండ్లు,నువ్వులుండలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్ రావు మాట్లాడుతూ,పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు అరటి పండ్లు, నువ్వులుండలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.అందరూ పుట్టిన రోజు లేదా మిగతా కార్యక్రమాలకు పేదలకు అన్నదానం చేయడం, మొక్కలు నాటడం, పౌష్టికాహారం అందించడం వంటి కార్యక్రమాలు చేయడం మంచిదని అన్నారు.ఈ సందర్భంగా హెప్సిబాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.ఉపాధ్యాయులు హరీష్,కిరణ్,వాలంటీర్ రాశి, విద్యార్థి తల్లిదండ్రులు రాజశేఖర్, మేరీ,తదితరులు పాల్గొన్నారు.

## రూ.47 లక్షల అవినీతి సొమ్మును రికవరీ చేయాలి

నెల్లూరు,కలెక్టరేట్, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :**

కలువాయి మండలంలో ఉన్న 20 గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని జిల్లా రెవెన్యూ అధికారి లవన్నను కలిసి, సిపిఐ నాయకులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సమితి సభ్యులు వి నాగేంద్ర మాట్లాడుతూ,కలువాయి మండలంలో మొత్తం 20 గ్రామాలు ఉండగా,11 కోట్ల మేర ఉపాధి హామీ పనులు జరిగాయని, అందులో రెండుకోట్ల 89 లక్షలు అవినీతి జరిగిందని సోషల్ ఆడిట్ అధికారుల విచారణలో తేలిందని, దీనిపై విజిలెన్స్ విచారణ జరిపి ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయడంతో పాటు, బాధ్యులైన అధికారులందరినీ సస్పెండ్ చేయాలని వారిని కోరారు.అప్పటి మండల స్థాయి అధికారి ఏపీవో,అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లపై విజిలెన్స్ విచారణ జరిపి, వారి వద్ద నుంచి ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయడంతో పాటు, వారిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వి లీలామోహన్ పాల్గొన్నారు.

## బీద లక్ష్మానంద స్వచ్ఛంద సామాజిక సేవలకు ఆత్మీయ సన్మానం

మనుబోలు, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని, బోగోలు మండలంలోని తాళ్లూరు గ్రామానికి చెందిన ప్రముఖ రక్తదాన చైతన్యకర్త ,లైఫ్స్ బ్లడ్ వరల్డ్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు, బిట్రగుంట గ్రామ సర్వేయర్ గా పని చేయుచున్న బీద లక్ష్మానంద కావలి డివిజన్ పరిధిలో 2012 నుండి లైఫ్స్ బ్లడ్ వరల్డ్ ఆర్గనైజేషన్ సభ్యుడుగా, కావలి రెడ్ క్రాస్ మెంబర్గా చేస్తున్న సామాజిక సేవను గుర్తించి, శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన యువతరం సేవా సమితి వారు 10వ వార్షికోత్సవ సందర్భంగా వసుదైక కుటుంబం అనే వేదికగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన స్వచ్ఛంద సేవకులతో బీద లక్ష్మనందశ్రీకు కాళహస్తి మున్సిపల్ చైర్మన్ రమేష్ బాబు చేతుల మీదుగా ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ,సామాజిక సేవలో తనకు తోడ్పడిన ప్రతి ఒక్క ఆత్మీయ మిత్ర బృందానికి, వాలంటీర్లకు ఈ ఆత్మీయ సన్మానం అంకితం అని,ఈ ప్రోత్సాహంతో సమాజం మీద తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.అలాగే తన సేవలు గుర్తించి ఆత్మీయ సన్మానం చేసిన శ్రీకాళహస్తి టీం యువతరం సేవా సమితి వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## పెచ్చులూడుతున్న ప్రభుత్వ భవనాలు.. అరచేతిలో ప్రజల ప్రాణాలు

బుచ్చిరెడ్డిపాలెం, **ఆగస్టు 06, జర్నలిస్ట్ ఫైల్ :**

నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ భవనాలు శిధిలా అవస్థలో చేరుకొని ప్రజల ప్రాణాలు అరచేతిలో ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇటు ప్రభుత్వాధికారులు,కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఎప్పుడు స్లాప్ పెచ్చులు పైన పడతాయని భయాందోళన చెందుతున్నారు.బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని విద్యుత్ భవనంలో స్లాపు పెచ్చులు విరిగి పడుతున్నాయని ఇటు అధికారులతోపాటు ప్రజలు కూడా ఆరోపణలు చేస్తున్నారు.ఆంధ్ర రాష్ట్ర



ముఖ్యమంత్రివర్యులు ప్రభుత్వ భవనాలపై దృష్టి పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగాక చర్యలు తీసుకోవడం కన్నా ముందస్తు చర్యలు తీసుకోవడం మంచిదని స్థానికులు కోరారు.ప్రభుత్వ అధికారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నారని,అంతేకాకుండా వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయం చేసి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో నిలబడి పనులు చేసుకోవాలంటే తమ భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా మంత్రులు స్పందించి, శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ భవనాలను పునర్నిర్మించాలని, లేదా తాత్కాలిక మరమ్మత్తులైన చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.(8)




# CRDA లో ఫైళ్లు మాయం..

**విజయవాడ, జర్నలిస్ట్ ఫైల్ :** అమరావతి రాజధాని నిర్మాణానికి నాడు టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ (సిఆర్డిఏ)ను ఏర్పాటు చేసింది. అందరి ఆమోదంతో అమరావతిని రాజధానిగా చేసిన చంద్రబాబు.. అక్కడ నిర్మాణ పనులు ప్రారంభించారు. సిఆర్డిఏను మరింత పటిష్టం చేశారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం అమరావతికి సంబంధించి కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది. అయితే ఇప్పుడు అదే కార్యాలయంలో టీడీపీ హయాంనాటి ఫైళ్లు మాయం కావడం ఆందోళన కలిగిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి కేంద్రంగా అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై టీడీపీ ముఖ్య నేతలపై కేసులు కూడా నమోదయ్యాయి. అప్పట్లో సీఆర్డిఏ ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విచారణ కోసం పలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో కొన్ని ఇప్పుడు కనిపించడం లేదు. దీంతో సీఆర్డిఏ అధికారులు ప్రభుత్వానికి ప్రత్యేకంగా నివేదించినట్లు సమాచారం. ఇటీవల రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత.. ఎక్కడికక్కడే ఫైళ్లు మాయం కావడం.. అగ్ని ప్రమాదాలు సంభవించి దగ్ధం కావడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం అమరావతి నిర్మాణాలపై నిపుణుల నివేదికలు, మరోవైపు సిఆర్డిఏ సమీక్షలు సీరియస్‌గా జరుగుతున్న వేళ.. ఫైళ్లు మాయం కావడం ఆందోళన కలిగిస్తోంది. నాడు విచారణ పేరుతో తీసుకెళ్లిన ఫైళ్లను మాయం చేసి ఉంటారన్న అనుమానాలు పెరుగుతున్నాయి. కేవలం కేసుల భయంతోనే ఇలా చేసి ఉంటారన్న అనుమానాలు ఉన్నాయి. సిఆర్డిఏ వ్యవహారాలకు సంబంధించి మంత్రి నారాయణ సమీక్షిస్తున్నారు. అమరావతి రాజధాని నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేక బాధ్యతలు తీసుకుంటున్నారు. ఈ తరుణంలో సీఆర్డిఏ కార్యాలయంలో ఇంజనీరింగ్, ప్లానింగ్, రెవెన్యూ, ఎస్టేట్.. ఇలా పలు విభాగాల ఫైల్స్ కనిపించడం లేదు. దీనిపై అధికారులు మంత్రి నారాయణకు ఫిర్యాదు చేశారు. ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అంశంపై గత వైసీపీ ప్రభుత్వం కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. చంద్రబాబుపై అక్రమ కేసుల్లో అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు ఒకటి. ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలో అవకతవకలకు పాల్పడ్డారు అన్నది అప్పటి వైసీపీ ప్రభుత్వ ఆరోపణ. ఆ కేసులో చంద్రబాబుతో పాటు మంత్రి నారాయణ పేరును కూడా చేర్చారు. అప్పట్లో విచారణ నిమిత్తం సీఆర్‌డీఏ నుంచి చాలా ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు అవే ఫైళ్లు కనిపించకపోవడం విశేషం. మొన్ననే మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్లు దగ్ధమయ్యాయి. ఈ కేసును ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సీఐడీ దర్యాప్తు సైతం కొనసాగుతోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే సీఆర్డీఏ ఫైళ్లు సైతం మాయం కావడం ఆందోళన కలిగిస్తోంది.

# కాంగ్రెస్ గూటికి మరో ఆరుగురు

**హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్ :** వరుస దెబ్బలతో బీఆర్ఎస్ రోజురోజుకూ కుదేలవుతోంది. ఎంతగా కట్టుదిట్టం చేసినా ఇప్పటికే పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరిపోయారు. ప్రస్తుతం 29 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు ఆ పార్టీలో. సీఎం రేవంత్ రెడ్డి పంతం పట్టారు. ఎలాగైనా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలనందరినీ కాంగ్రెస్ పార్టీలో చేర్చేందుకు..ఆ పార్టీలో మరో పది మంది ఎమ్మెల్యేలు బయటకు వస్తే పార్టీకి ప్రతిపక్ష హోదా లేకుండా చేసేయొచ్చనే ఆలోచనలో ఉన్నారు రేవంత్ రెడ్డి. త్వరలోనే మరిన్ని వలసలు ఉంటాయని అనుకుంటున్న నేపథ్యంలో బీఆర్ఎస్ అగ్రనేతలు తమ పార్టీ వారిని బుజ్జగిస్తున్నారు. ఇకపై వలసలు లేకుండా జాగ్రత్త వహించాలని ..ముందుగానే వారితో సంప్రదింపులు చేస్తున్నారు. మొన్నటికి మొన్న సబితా ఇంద్రారెడ్డి కూడా పార్టీ మారబోతున్నారని పుకార్లు రావడంతో సబితను పార్టీ మారకుండా చేయగలిగారు.పార్టీ మారిన అభ్యర్థులపై ఫిరాయింపుల చట్టం అమలు చేయాలని చూస్తున్నారు. నయానో భయానో చెప్పి ఉన్న ఎమ్మెల్యేలు జారిపోకుండా చేద్దామనే యోచనలో ఉన్నారు. అయితే ఇన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా బీఆర్ఎస్ అగ్రనేతల గుండెల్లో మరో ఆరుగురు ఎమ్మెల్యేలు జారిపోతారనే భయం పట్టుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ నేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాలలో ఎవరెవరు ఎమ్మెల్యే లు అనుచితంగా ప్రవర్తించారో, ఎవరెవరు అన్ పార్లమెంటరీ పర్డ్స్ వాడారో, సమావేశాలకు ఆటంకం కలిగించిన వారెవరో అనేది సీసీ కెమెరాల ఆధారంగా నివేదికలు తయారవుతున్నాయి. కొత్తగా వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంయమనం కోల్పోయి సభలో ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు. ఇప్పుడు వీరందరిపై లిస్ట్ రెడీ అవుతోంది. రేవంత్ రెడ్డి ఇటీవల మాట్లాడుతూ ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయబోతున్నట్లు హింట్ ఇచ్చారు. వారంతా పదేపదే సభా నియమాలు ఉల్లంఘించారంటూ త్వరలోనే వారిపై వేటు పడనుందని అనడంతో బీఆర్ఎస్ లీడర్లు అదిరిపోతున్నారు.ఎవరిపై వేటు పడనుందో.. ఎవరెవరి సభ్యత్వం రద్దు కానుందో అని ఆందోళన పడుతున్నారు. గతంలో కేసీఆర్ చేసిన పనే ప్రస్తుతం రేవంత్ రెడ్డి కూడా చేయబోతున్నారని సమాచారం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తల్లో నాటి సీఎంగా ఉన్న కేసీఆర్ అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఇదే అస్త్రాన్ని ప్రయోగించారు. దాని ప్రకారం సభ్యత్వాలను కోల్పోయారు నాటి కాంగ్రెస్ నేతలు. వీరిలో కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కుమార్ లు ఉన్నారు. నాటి స్పీకర్ వీరి సభ్యత్వాలను రద్దు చేశారు. సభాహక్కుల ఉల్లంఘనకు పాల్పడ్డారని..సభా మర్యాదలు పాటించలేదనే సాకుతో వీరి సభ్యత్వాలను రద్దు చేశారు.ఇప్పుడు కూడా కేసీఆర్ అనుసరించిన వ్యూహమే సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తారా అని అంతా అనుకుంటున్నారు. రేవంత్ వ్యాఖ్యలు దీనికి బలం చేకూర్చేవిగా ఉన్నాయి. ఇప్పుడు ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు కూడా సభ్యత్వం కోల్పోతే బీఆర్ఎస్ బలం 23కు పడిపోతుంది. ఇంక ఓ ముగ్గురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరిపోతే బీఆర్ఎస్ పార్టీని విలీనం చేసే ఛాన్స్ ఉంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత డిసెంబర్ నెలలో ఆరు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. తర్వాత పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఓటాన్ బడ్జెట్ సమావేశాలు కూడా తొమ్మిది రోజులు జరిగాయి. ఈ సమావేశాలలో స్పీకర్ విధులకు ఆటంకం కలిగిస్తూ కొందరు బీఆర్ఎస్ నేతలు సభా నియమాలను ఉల్లంఘించారు. సభలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. వీళ్ల ప్రవర్తన అంతా ఇప్పుడు సీసీ కెమెరాల సాయంతో పరిశీలించి స్పీకర్ వీరి సభ్యత్వాల రద్దు నిర్ణయం తీసుకుంటారని అంతా భావిస్తున్నారు.

# మాజీల వ్యూహాత్మక అడుగులు..!



రాజకీయ స్నేహితులు కేసీఆర్, జగన్ పయనం ఎటు? ఎన్డీఏ కూటమిలో చేరుతారా? ఇండియా కూటమిని ఆశ్రయిస్తారా?ఇద్దరూ కలిసి నిర్ణయం తీసుకుంటారా? లేకుంటే వేర్వేరు మార్గాల్లో వెళ్తారా? తెలుగు రాష్ట్రాల్లో ఇదే చర్చ నడుస్తోంది. దాదాపు ఇద్దరి పరిస్థితి అలానే ఉంది. 2018 ఎన్నికల్లో ఓడిపోయారు కేసీఆర్. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా రాలేదు. దీంతో తెలంగాణలో కేసిఆర్ పార్టీ మనుగడ కూడా కష్టమవుతోంది. ఆ పార్టీ నుంచి ఇతర పార్టీలోకి చేరికలు పెరిగాయి. ఏకంగా ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్నారు. మరోవైపు కుమార్తె కవిత అవినీతి కేసుల్లో చిక్కుకొని జైలు జీవితం అనుభవిస్తున్నారు. ఏపీలో కూడా జగన్ పరిస్థితి అలానే ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైంది. 11 అసెంబ్లీ సీట్లకే పరిమితమైంది. కనీసం జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. దీంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు అక్రమాస్తుల కేసులు, బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య అంశం తెరపైకి వస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులపై దాడులు,కేసులు ఎదురవుతున్నాయి. ఈ తరుణంలో పార్టీని కాపాడుకోవడం ఇబ్బందికరమే. అధికారంలో ఉన్న సమయంలో రాజకీయ శత్రువులను పెంచుకున్నారు ఈ ఇద్దరు నేతలు. సొంత రాష్ట్రాలతో పాటు జాతీయస్థాయిలో నమ్మదగిన స్నేహాన్ని కొనసాగించలేకపోయారు. దాని ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. తాము ఇబ్బందుల్లో ఉన్న పట్టించుకునే వారు కరువయ్యారు. కనీసం మద్దతు తెలిపేందుకు కూడా ముందుకు రాని పరిస్థితి. అందుకే వీరిద్దరూ పునరాలోచనలో పడ్డారు. జాతీయస్థాయిలో స్నేహం పెంచుకోవాలని చూస్తున్నారుఈ ఇద్దరు నేతలకు ఇప్పుడు జమిలి ఎన్నికల భయం పట్టుకుంది. 2019 నుంచి కార్యాచరణ ప్రారంభించింది బిజెపి. కానీ 2024 ఎన్నికలకు ఒక ఏడాది ముందు జమిలి ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ ప్రారంభమైంది. సాధ్యాసాధ్యాలపై ఒక కమిటీని వేసింది కేంద్రం. ఈ కమిటీకి అధ్యక్షుడిగా మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ని నియమించింది. ఆయన నాయకత్వంలో కమిటీ ఇప్పటికే చాలాసార్లు భేటీ అయింది. 2029 నాటికి దేశంలో జమిలి ఎన్నికలు జరుగుతాయని చెబుతున్నారు. అదే జరిగితే దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయి. జాతీయ పార్టీల ప్రభావం ప్రాంతీయ పార్టీలపై తప్పకుండా పడుతుంది.ప్రాంతీయ పార్టీల మధ్య పోటీ కంటే.. కూటమిల మధ్య గట్టి ఫైట్ నెలకొనే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో జగన్, కెసిఆర్ ఏదో ఒక కూటమిలో చేరక తప్పని పరిస్థితి. ఇప్పటికే ఏపీలో ఎన్డీఏ కూటమిలో టిడిపి, బిజెపి, జనసేన ఉన్నాయి. ఇండియా కూటమిలో కాంగ్రెస్, వామపక్షాలు కొనసాగుతున్నాయి. ఏ కూటమిలో చేరకుండా వైసిపి ఉంది. రెండు రాష్ట్రాల్లో కూడా బలమైన ప్రతిపక్ష పార్టీ నేతలు రాకుండా దుమ్మా కొడుతున్నారు. కేసీఆర్ దాదాపు 40 అసెంబ్లీ సీట్లు గెలుచుకొని బలమైన ప్రతిపక్ష నేతగా కనిపిస్తున్నారు కానీ ఆయన అసెంబ్లీలోకి వెళ్లిన సందర్భమే లేదు మరోవైపు జగన్ ప్రతిపక్ష హోదా లేదు అయినా ఆయన వెళ్లొచ్చు. కానీ ఆయన కూడా అసెంబ్లీని పూర్తిగా బహిష్కరించారు. బయట మాట్లాడుతున్నారు తప్ప అసెంబ్లీలోకి వెళ్లి ఎన్నికల ప్రచార సమయంలో మాట్లాడినట్లు మాట్లాడలేకపోతున్నారు.ఏపీలో బడ్జెట్ సమావేశాలు మొదలైన రోజు జగన్ ఢిల్లీకి వెళ్లి ధర్నా చేశారు. మరోవైపు కేసీఆర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోయారు. తర్వాత మీడియా సమావేశంలో కొద్దిసేపు మాట్లాడారు అనంతరం ఆయన కనిపించిన దాఖలాలు లేవు. సాధారణంగా ప్రతిపక్ష హోదా అంటే ఒక క్యాబినెట్ మినిస్టర్ తో సమానమైనది. దానిని సద్వినియోగం చేసుకుంటూ ప్రజల కోసం మాట్లాడాల్సిన అవసరం ఉంది. కానీ ఓడిపోతే ఇక తమకు రాష్ట్రంతో సంబంధం లేనట్లు, అధికారంలో ఉన్న వాళ్ళు ఏం చేసినా తమకు అనవసరం క్వశ్చన్ చేయమన్నట్లు కెసిఆర్ ప్రవర్తిస్తున్నారు. మరోవైపు జగన్ కూడా అలాగే తయారయ్యారు.కెసిఆర్ జగన్ పార్టీల నుంచి వెళ్ళిపోతున్నావా ఎమ్మెల్యేల సంఖ్య కూడా పెరుగుతోంది. కేసీఆర్ వారిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు జగన్ మాత్రం ఆ ప్రయత్నాలు చేయనట్లే కనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు తమ ఎమ్మెల్యేలతో జగన్ గాని కెసిఆర్ గానీ మాట్లాడలేదు ఇప్పుడు ఉండమంటే వాళ్ళు ఉంటారా అనేది కూడా ప్రశ్నార్థకమే. ఏపీలో వైసీపీ పట్ల సానుభూతి ఇప్పట్లో కనిపించేలాగా కనిపించడం లేదు. కెసిఆర్ పరిస్థితి కూడా అలానే తయారయింది. లోక్‌సభ ఎన్నికల్లో అతను ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయారు.రైతుబంధు, దళిత బంధు, బీసీ బంధు అంటూ కేవలం కొన్ని వర్గాల ప్రజలకు మాత్రమే డబ్బులు ఇస్తానని కేసీఆర్ అంటున్నారు కానీ పేద ప్రజలకు మాత్రం ఇల్లు కట్టిస్తానని చెప్పడం లేదు. కొన్ని హామీలను నెరవేర్చిన కీలకమైన హామీలను నెరవేర్చడంలో ఫెయిల్ అయ్యారు. అందుకే ప్రజల్లో ఆగ్రహం ఎక్కువగా ఉంది. మరి వచ్చేసారి కాంగ్రెస్ కంటే కేసీఆర్ ఏ బెటర్ అని ఒక నిర్ణయానికి వస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది.తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇండియా కూటమికి చెందినది. బిజెపి ఎన్డీఏ కు నేతృత్వం వహిస్తోంది. దీంతో అక్కడ ఏ కూటమికి చెందినది కేసీఆర్ పార్టీ2029లో జమిలి ఎన్నికలు జరిగితే.. జగన్ ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించాలి.ఎన్డీఏలో టిడిపి, జనసేనలు బలమైన పక్షాలు కావడంతో ఆ కూటమిలో చేరేందుకు జగన్ కు చాన్స్ లేదు. అందుకే ఆయనకు ఏకైక ఆప్షన్ ఇండియా కూటమి. కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి ఎన్నికలకు సిద్ధం కావడమే ఆయన ముందున్న కర్తవ్యం. కెసిఆర్ ది మరీ విచిత్ర పరిస్థితి. తెలంగాణలో ఆ పార్టీ ఏ కూటమిలో చేరాలనుకున్నా అధికారం ఆశించే పరిస్థితిలో లేదు. కేవలం సర్దుబాటు వరకు మాత్రమే చేయగలదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కెసిఆర్ తో పాటు జగన్ రాజకీయ కార్నర్‌లో ఉన్నట్టే

# వయనాడ్ మృతులు 370కు పైనే..



**తిరువనంతపురం, జర్నలిస్ట్ ఫైల్ :** వయనాడ్ విధ్వంసం 370 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. గల్లంతైన వందలాది మంది కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. స్థానికులతో పాటు పోలీసులు, ఇండియన్ ఆర్మీ, ఔఆఖీఈ సిబ్బంది అన్ని విధాలుగా బాధితులకు సహాయం అందిస్తున్నారు. మందక్కై చూరల్‌మల ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ప్రాణనష్టమూ ఇక్కడే ఎక్కువగా నమోదైంది. రెస్క్యూ టీమ్స్ వీలైనంత వరకూ సరైన సమయానికే వెళ్లి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే...వాతావరణ పరంగా ఎదురవుతున్న సవాళ్ల వల్ల కొన్ని చోట్ల రెస్క్యూ ఆలస్యమవుతోంది. ఈ కారణంగా కొంత మంది సాయం కోసం ఎదురు చూసి చివరకు ప్రాణాలు కోల్పోతున్నారు. వయనాడ్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో స్టాఫ్ మెంబర్‌గా పని చేస్తున్న ఓ మహిళ ఇలానే చనిపోయింది.ముఖ్యమైన విషయం ఏంటంటే...వయనాడ్‌లో ఈ విధ్వంసం మొదలైనప్పుడు మొట్టమొదట అత్యవసర సేవల్ని అలెర్ట్ చేసింది ఈ మహిళే. పేరు నీతూ జోజో. రెస్క్యూ టీమ్ ఆమెని చేరుకుని సాయం అందించేలోగానే మృతి చెందింది. అప్పటికీ ఎమర్జెన్సీ టీమ్‌కి కాల్ చేసి మాట్లాడింది నీతూ. తనతో పాటు మరి కొన్ని కుటుంబాలు ఇలానే చిక్కుకుపోయాయని, సాయం అందించాలని కోరింది. ఈ బాధితులంతా నీతూ ఇంట్లోనే ఉన్నారు. చూరల్‌మలలో కొండచరియలు విరిగి పడగానే వెంటనే వాళ్లంతా నీతో ఇంట్లో తలదాచుకునేందుకు వెళ్లారు. అప్పటి నుంచి అక్కడే చిక్కుకుపోయారు ఇంట్లోకి నీరు వచ్చి చేరుతున్నాయని, చుట్టూ శిథిలాలున్నాయని ఎమర్జెన్సీ టీమ్‌కి కాల్ చేసి చెప్పింది బాధితురాలు. కొన్ని చోట్ల కార్లు కూడా కొట్టుకుపోయాయని అంత ఉద్ధృతంగా ప్రవాహం ఉందని వివరించింది. తన ఇంట్లో దాదాపు ఐదారు కుటుంబాలున్నాయని, సాయం చేయాలని కోరింది. ఎమర్జెన్సీ టీమ్‌తో పాటు తను పని చేస్తున్న హాస్పిటల్ డాక్టర్‌లకీ కాల్ చేసింది నీతూ జోజో. “ఆమె మాకు కాల్ చేసినప్పుడు గొంతు చాలా దీనంగా వినిపించింది సాయం కోసం వేడుకుంది. నేను వెంటనే పోలీసులకు సమాచారం అందించాను. చూరల్‌మలకి ఓ అంబులెన్స్ కూడా పంపించాం. చెట్లు కూలిపోవడం వల్ల అంబులెన్స్ అటుగా వెళ్లలేకపోయింది. అప్పటికీ మా డ్రైవర్ ఆమెతో మాట్లాడాడు.

కానీ రెండోసారి కొండ చరియలు విరిగి పడిన తరవాత కాల్ కలవలేదు. ఆమెని కాపాడలేకపోయాం. రెండు రోజుల తరవాత ఆమె మృతదేహం కనిపించింది” అని ఓ డాక్టర్ వివరించారు.తప్పించుకోడానికీ ఏ దారీ లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయిందని చెప్పారు. ఇక ఆ హాస్పిటల్‌లో మరో నలుగురు ఉద్యోగులూ చనిపోయారు. నీతూ ఒక్కరే కాదు. రెస్క్యూ టీమ్స్ చేరుకోడానికి వీల్లేని ప్రాంతాల్లో ఇలా చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కాపాడాలని ఎంత ప్రయత్నించినా ఏదో ఓ ఆటంకం వాళ్లను అడ్డుకుంటోంది. చాలా చోట్ల వంతెనలు ధ్వంసమయ్యాయి. రోడ్ కనెక్షన్ లేకుండా పోయింది. అప్పటికప్పుడు తాత్కాలికంగా వంతెనలు నిర్మించి సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి రెస్క్యూ టీమ్స్.

# వయనాడ్ సహాయక చర్యల్లో నటుడు పజ్రీశ్

## ఇదే క్రమంలో ఆచూకీ లేకుండా పోయిన నటుడు



**వయనాడ్, జర్నలిస్ట్ ఫైల్ :** ప్రకృతి సృష్టించిన విలయానికి కేరళలోని వయనాడ్ అతలాకుతలమైంది. ఈ కఠిన సమయంలో కొందరు యువత ప్రాణాలకు తెగించి, సహాయక చర్యల్లో పాల్గొన్నారు. వారిలో పజ్రీశ్ కూడా ఒకరు. కొండచరియలు విరిగిపడటంతో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ప్రమాదాన్ని లెక్కచేయలేదు. ఎంతో మందిని కాపాడిన అతడి జాడ ఇప్పుడు తెలియకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి విపత్తు గురించి తెలియగానే వయనాడ్‌లోని చూరాల్‌మలకు చెందిన పజ్రీశ్ రంగంలోకి దిగారు. తోటివారికి అవసరం అంటే ఏమాత్రం ఆలోచించకుండా సహాయం చేయడంలో ముందుంటారన్న పేరుంది. ముండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయని తెలియగానే, రక్షించేందుకు ప్రమాదకర కొండ ప్రాంత మార్గంలో జీప్‌లో వెళ్లారు. అలా రెండుసార్లు పలువురిని కాపాడారు. ఆ తర్వాత కుటుంబంతో కలిసి సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అంతలోనే సహాయం కోసం మరో ఫోన్ కాల్ వచ్చింది. దాంతో మళ్లీ అదే ప్రాంతానికి జీప్‌లో వెళ్లి తిరిగి రాలేదు. చూరాల్‌మల ప్రాంతంలో ధ్వంసమైన జీప్ కనిపించింది. కానీ అతడి జాడ మాత్రం తెలియరాలేదని స్థానికులు వెల్లడించారు. పజ్రీశ్ అంటే అందరికీ ఇష్టం. మా ఇళ్లలో ఎలాంటి కార్యక్రమమైనా ముందుండి తనవంతు సహకారం అందిస్తాడు. నా కుమార్తె పెళ్లికి అతడు చేసిన సహాయం మరువలేనిది' అని మరొకరు తెలిపారు. ఆ కొండ ప్రాంతానికి వెళ్లొద్దని చెప్పినా వినలేదని పజ్రీశ్ స్నేహితులు వెల్లడించారు. ముండక్కై ప్రాంతంలో చాలా మంది చిక్కుకుపోయారని, వారిని రక్షించాలంటూ వెళ్లాడని తెలిపారు. 'అతడు మా సూపర్ హీరో. ఇప్పుడతడు మా ముందు లేడు' అంటూ వాపోయారు. కొండచరియలు విరిగిపడటంతో ముండక్కై చూరాల్‌మల ప్రాంతాల్లో వందలాది ఇళ్లు తుడిచిపెట్టుకుపోయాయి. ఆదివారం సాయంత్రం వరకు 222 మృతదేహాలను వెలికితీశారు. ఆచూకీ గల్లంతైనవారి సంఖ్య 180 వరకూ ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆగస్టు 9 నుండి 17 వరకు

# వీరభద్రస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

**తిరుపతి, జర్నలిస్ట్ ఫైల్ :** నారాయణవనం శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆగస్టు 9 నుండి 17వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఆగస్టు 9వ తేదీ ఉదయం అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ధ్వజారోహణం, రాత్రి 7.30 నుండి 10 గంటల వరకు చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు స్నపనతిరుమంజనం, రాత్రి 7 నుండి 9.30 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. ఇందులో భాగంగా ఆగస్టు 10వ తేదీ రాత్రి సింహవాహనం, ఆగస్టు 11న రాత్రి భూత వాహనం, ఆగస్టు 12న రాత్రి శేష వాహనం, ఆగస్టు 13న రాత్రి 7 గంటలకు అగ్నిగుండం ప్రవేశం అనంతరం పులి వాహనంపై స్వామివారు విహరిస్తారు. అదేవిధంగా ఆగస్టు 14న రాత్రి గజవాహనం, ఆగస్టు 15న మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం, అనంతరం రాత్రి 7.30 నుండి 9 గంటల వరకు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. గృహస్తులు (ఇద్దరు) రూ.500/- చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, లడ్డూ, అప్పం ప్రసాదాలను బహుమానంగా అందజేస్తారు. ఆగస్టు 16న సాయంత్రం 5 గంటలకు వసంతోత్సవం, రాత్రి 7 గంటలకు అశ్వవాహనం, ఆగస్టు 17న ఉదయం 10 గంటలకు వీరఖడ్గస్నానం, మధ్యాహ్నం 3 గంటలకు పల్లకీ ఉత్సవం, రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సాయంత్రం హరికథలు, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# ఈ శునకాలు ప్రపంచంలోనే ఫేమస్..



- ముద్దుగా ఉండే అరుదైన జాతి శునకాలు
- యాక్టివ్‌గా, విధేయతతో ఉండటం అదనపు ప్రయోజనం
- భారీ డిమాండ్.. ఖరీదు లక్షల్లో..

చాలా మంది ఇళ్లలో పెంపుడు శునకాలను పెంచుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో ఈ ట్రెండ్ మరీ ఎక్కువైంది కూడా. ఇందులో చాలా మంది కంటికి నదురుగా కనబడినదో, ఎవరివద్ద అయినా చూసినదో అయిన జాతుల శునకాలను పెంచుకుంటున్నారు. మరి ప్రపంచంలో అరుదైన, అత్యంత ఖరీదైన శునక జాతులు ఏవో తెలుసా?

**సమోయెడ్ డాగ్స్..** రష్యాలోని సైబీరియా ప్రాంతానికి చెందిన అరుదైన జాతి శునకాలివి. ప్రశాంతంగా, ప్రేమగా ఉంటాయి. ఎప్పుడూ నవ్వుతున్నట్టుగా ఉండే ముఖ కవళికలతో ఆకట్టుకుంటాయి. యాక్టివ్ గా ఉంటాయి.

**లోచెన్ డాగ్స్..** మొదట్లో ఫ్రాన్స్ ఈ జాతి శునకాలకు ఫేమస్. తర్వాత యూరప్ అంతటా విస్తరించాయి. యాక్టివ్ గా, ఆటలాడుతూ ఉంటాయి.

**చౌ.. చౌ.. డాగ్స్..** ఉత్తర చైనాలో ఉండే పురాతన బ్రీడ్ ఇది. చూడటానికి భలే అందంగా ఉంటాయి. కాస్త మొండిగా వ్యవహరిస్తుంటాయి. వీటి మెయింటెనెన్స్ కూడా చాలా ఎక్కువ.

**టిబెటన్ మాస్టిఫ్..** రక్షణ కోసం, కాపలా కోసం వాడే అరుదైన జాతి శునకాలివి. యజమానుల పట్ల పూర్తి విధేయతతో ఉంటాయి. వారిని రక్షించేందుకు ఎంతకైనా తెగిస్తాయి. వీటి మెయింటెన్స్ కూడా చాలా ఎక్కువ.

**అజవఖ్ డాగ్స్..** పశ్చిమ ఆఫ్రికాకు చెందిన ఈ శునకాలు వేటకు ఫేమస్. అత్యంత వేగంతో పరుగెత్తుతాయి. యజమానుల పట్ల విధేయంగా ఉంటాయి. రక్షణ, కాపలా కోసం ఈ శునకాలను పెంచుకుంటూ ఉంటారు.

**రాట్ వేలర్ డాగ్స్..** మంచి ప్రవర్తనతో, మంచి క్రమశిక్షణతో ఉండే శునకాలివి. వీటి ఆహారం, ఆరోగ్యం మెయింటెనెన్స్ చాలా ఎక్కువ. కానీ మంచి తోడుగా ఉంటాయి.

# ఆల్ ది బెస్ట్ బసవయ్య

## ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆసక్తికర ట్వీట్

- ఆర్థిక ఇబ్బందులతో ఐఐటీలో చేరలేకపోతున్నానంటూ బసవయ్య అనే విద్యార్థి ట్వీట్
- రూ.4 లక్షల ఫీజు చెల్లించలేనని ఆవేదన
- ఫీజు విషయం నేను చూసుకుంటా... నువ్వు చదువుకో అంటూ లోకేష్ భరోసా
- లోకేష్‌ను ప్రశంసించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**అమరావతి,** ఆర్థిక ఇబ్బందులతో లక్నో ఐఐటీలో చేరలేకపోతున్నానంటూ అత్తిలికి చెందిన బసవయ్య అనే విద్యార్థి ఆవేదన వ్యక్తం చేయగా, నేనున్నా తమ్ముడూ... ఫీజు విషయం నేను చూసుకుంటా అంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆ విద్యార్థికి భరోసా ఇవ్వడం తెలిసిందే. దీనిపై ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించారు. మంత్రి నారా లోకేశ్ ను ప్రశంసించారు. నారా లోకేశ్ స్పందించి విద్యార్థికి చేసిన సాయం స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. తన కల సాకారం అవుతుందని ఆ విద్యార్థి ఊహించి ఉండడని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఆల్ ది బెస్ట్ బసవయ్య అంటూ తాను కూడా ఆ విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, లక్నో ఐఐటీలో ఫీజు రూ.4 లక్షలు ఉందని, అంత ఖర్చు తన కుటుంబం భరించలేని స్థితిలో ఉందని బసవయ్య మంత్రి నారా లోకేశ్ ను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశాడు. తన తల్లిదండ్రులు కూలి పనులు చేసుకునే పేదవాళ్లని బసవయ్య పేర్కొన్నాడు. ఈ ట్వీట్ పై స్పందించిన నారా లోకేశ్... బసవయ్యా, నీ కల నెరవేర్చే బాధ్యత నాది అంటూ పూర్తి భరోసా అందించారు. దాంతో, నారా లోకేష్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది.

# రిమ్స్ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వాలు మారిన మారని కాంట్రాక్టర్ తీరు
- రిమ్స్ ఆస్పత్రిని పరిశీలించిన
- బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్



**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడంలో ముందుండాల్సిన రిమ్స్ ఆస్పత్రిలో అనేక సమస్యలు తిష్టవేసినా పట్టించుకోకపోవడం తగదని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్ తెలిపారు. మంగళవారం కడప రిమ్స్‌ను బీజేవైఎం నాయకులు వార్డు వార్డుల లను పరిశీలించి సమస్యలు తెలుసుకోవడంతోపాటు రోగులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో అపరిశుభ్రత అనేది ప్రధాన సమస్యగా ఉందన్నారు. గత 20 సంవత్సరాలుగా వారసత్వంలాగా ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్ బాల నాగిరెడ్డి కొనసాగడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఈ ప్రాంతంలో అంతా ఆయన చెప్పినట్లు సాగడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా ఆయన మాత్రం అలాగే కొనసాగుతూ రోగుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదన్నారు. ఇలాంటి కాంట్రాక్టర్ ను తొందరగా సాగనంపాలన్నారు. అలాగే ప్రభుత్వం మారిన ఫోటోలు ఇంకా మార్చడం లేదన్నారు. ప్రభుత్వం తొందరగా కాంట్రాక్టర్ బాల నాగిరెడ్డిని సాగనంపి కొత్త కాంట్రాక్టర్కు ఇచ్చి రిమ్స్ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. ప్రజలు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇక్కడికి వస్తే సమస్యలు వారికి స్వాగతం పలుకుతున్నాయన్నారు. ఇక వైద్యులు కూడా ప్రభుత్వం వేతనాలు ఇస్తున్న విషయాన్ని విస్మరించి ఇష్టారాజ్యంగా వ్యవహరించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఆస్పత్రిని పరిశీలిస్తే ఇంకా రిమ్స్‌కు గత పాలకుల పరిధిలో ఉందని అనిపిస్తోందన్నారు. ఇక్కడి సమస్యలతోపాటు కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి వ్యవహారంపై బీజేపీకి చెందిన రాష్ట్ర మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని బొమ్మన విజయ్ వివరించారు. పేద ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందేవరకు తమ పోరాటాలు కొనసాగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేవైఎం నాయకులు, బీజేపీ ప్రతినిదులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జనరల్ సెక్రెటరీ సురేంద్ర, అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రవీణ్, నాయుడు ట్రెజరీ శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్ సాయి ఈశ్వర్, బీజేవైఎం నాయకులు వినోద్ రెడ్డి, వెంకట్, షణ్ముఖి రెడ్డి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో...బయలు వీరభద్రస్వామికి ప్రదోషకాల అభిషేకం



**శ్రీశైలం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** లోకకల్యాణం కోసం మంగళవారం శ్రీశైలక్షేత్ర పాలకుడైన శ్రీబయలు వీరభద్రస్వామివారికి విశేషపూజలను నిర్వహిం చారు. ప్రతీ మంగళవారం మరియు అమావాస్యరోజులలో బయలు వీరభద్రస్వామి వారికి ఈ విశేష అభిషేకం, అర్చనలను నిర్వహిస్తారు .
బయలు వీరభద్రస్వామివారు శివభక్తగణాలకు అధిపతి. అదేవిధంగా శ్రీశైలక్షేత్రపాలకుడుగా క్షేత్రానికి ప్రారంభంలో ఆరుబయట ఉండి, ఎటువంటి ఆచ్ఛాదన, ఆలయం లేకుండగా బయలుగా దర్శనమిస్తాడు కనుక ఆయనకు బయలువీరభద్రస్వామి అని పేరు వచ్చింది.
ప్రసన్నవదనంతో కిరీట ముకుటాన్ని కలిగి దశభుజుడైన స్వామివారు పది చేతులలో వివిధ ఆయుధాలతో దర్శనమిస్తాడు. స్వామివారికి క్రింది వైపులో కుడివైపున దక్షుడు, ఎడమవైపున భద్రకాళి దర్శనమిస్తారు. ఈ స్వామిని దర్శించినంత మాత్రానే ఎంతటి క్లిష్ట సమస్యలైనా తొలగిపోతాయని, వ్యాధులు నశించి ఆయురారోగ్యాలు చేకూరుతాయని ప్రసిద్ధి. ముఖ్యంగా ఆగమసంప్రదాయంలో క్షేత్రపాలక పూజకు చాలా విశేష స్థానం ఉంది. క్షేత్ర పాలకుడు పూజలు చేయడం వలన ఆ క్షేత్రంలో ఉన్నటువంటి భక్తులు ఎటువంటి భయ బాధలు లేకుండా సుఖ సంతోషాలతో ఉంటారు.
మంగళవారం, ఆదివారం మరియు అమావాస్య రోజులలో చేసే వీరభద్ర పూజ అనేక ఫలితాలు ఇస్తుందని ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్వామి పూజ సకలగ్రహ అరిష్టదోషాలు, దుష్ట గ్రహ పీడలు తొలగిపోతాయి. అదేవిధంగా సంతానం, ఐశ్వర్యం మొదలైన అనేక శుభఫలితాలు చేకూరుతాయి. ఈ పూజాదికాలలో పంచామృ తాలతోనూ, బిల్వోదకం, కుంకు మోదకం, హరిద్రోదకం, భస్మోదకం, గంధోదకం, పుష్పోదకం, శుద్ధజలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు.

# విశాఖలో వైకాపాకు షాక్.. జనసేనలో చేరిన ఐదుగురు కార్పొరేటర్లు




**మంగళగిరి ( జర్నలిస్ట్ ఫైల్ ):** విశాఖపట్నంలో వైకాపాకు గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లతో పాటు పలువురు నేతలు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ చేరికలు జరిగాయి. కార్పొరేటర్లతో పాటు పలువురు నేతలకు డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కండువా కప్పి తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అధిక స్థానాలు గెలుచుకుంటుందని ఈ సందర్భంగా పవన్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. “నేను డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఇదే తొలి రాజకీయ చేరికల కార్యక్రమం. నాకు ఇష్టమైన వైజాగ్‌తో మొదలైంది. ఇటీవల ప్రభుత్వ కార్యక్రమాలు అలవాటై.. రాజకీయ సమాశాలు కొత్తగా అనిపిస్తున్నాయి. మన రాష్ట్రం బాగుండాలి. విభజన తర్వాత నుంచి రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో మనం నిలబడ్డాం. ప్రయాణం చేశాం. వైకాపా నాకు వ్యక్తిగతంగా శత్రువు కాదు.. ఇది చాలా సందర్భాల్లో చెప్పాను. ఒక్కోసారి నేతలు మాట్లాడే విధానం.. నమ్ముకున్నవారికి నష్టం చేస్తాయి. జనసేన మీ అందరికీ బలాన్ని ఇచ్చి.. ఎదగాలని కోరుకొనే వాతావరణం కల్పిస్తుంది. స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మంచి విజయం సాధించాలని కోరుకొం టున్నా. అందుకు మీరంతా సహకరించాలి. విశాఖలో కాలుష్యం సమస్య చాలా ఎక్కువగా ఉంది. దీని నివారించేందుకు మీరంతా బాధ్యతతో పనిచేయాలి. విశాఖలో కాలుష్యాన్ని తగ్గించేందుకు త్వరలో కార్యాచరణ ప్రారంభిస్తాం” అన్నారు.

# శ్రీవారి దర్శనం టిక్కెట్ల బుకింగ్ కోసం మధ్యవర్తులను సంప్రదించవద్దు : టీటీడీ



**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ):** తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు ఆన్‌లైన్‌లో దర్శన టిక్కెట్లను బుక్ చేసుకునేందుకు మధ్యవర్తులను సంప్రదించవద్దని టీటీడీ మరోసారి సూచించింది. ఇటీవల వెరిఫికేషన్‌లో 545 మంది యూజర్ల ద్వారా దాదాపు 14,449 అనుమానిత శ్రీవాణి లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. అటువంటి వాటినీ బ్లాక్ చేసి వారికి మెసేజ్ ఫార్వార్డ్ చేశామని వివరించారు.
కొంతమంది భక్తులు 225 శ్రీవాణి టికెట్లను బుక్ చేసుకున్నారని, అనుమానిత వ్యక్తులు దర్శనానికి వచ్చినప్పుడు టీటీడీ విజిలెన్స్ తనిఖీలు చేస్తోందని పేర్కొన్నారు. దర్శనం, సేవలు, వసతి బుకింగ్‌లలో నకిలీ ఐడీలతో దర్శనానికి వచ్చే యాత్రికులను కూడా టీటీడీ విజిలెన్స్ గుర్తిస్తోందని వెల్లడించారు.
యాత్రికులు మధ్యవర్తుల వద్దకు వెళ్లవద్దని, ఆన్‌లైన్ లేదా కరెంట్ బుకింగ్ ద్వారా దర్శనం టిక్కెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ అధికారులు కోరారు. అవకతవకలకు పాల్పడే వారిపై టీటీడీ క్రిమినల్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి టీటీడీకి సహకరించాలని కోరారు.

# ప్రజల కోసం... మా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి



- శ్రీ కనక పుట్లమ్మ తల్లి చల్లని చూపుతో మంగళగిరికి మంచి రోజులు
- పెదకొండూరు శ్రీ కనక పుట్లమ్మ ఆలయంలో మంత్రి లోకేష్ పూజలు

**మంగళగిరి , దుగ్గిరాల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** శ్రీ కనక పుట్లమ్మ తల్లి చల్లని చూపుతో మంగళగిరి నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. దుగ్గిరాల మండలం పెద్దకొండూరులో వేంచేసి ఉన్న శ్రీ కనక పుట్లమ్మ దేవాలయంలో మంత్రి లోకేష్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తనని కలవడానికి వచ్చిన గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి అందరితో ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో లోకేష్ మాట్లాడుతూ... అమ్మ ఆశీస్సులతో నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో మంగళగిరి నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందనుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని అన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం ఉండవల్లిలోని తమ ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని లోకేష్ చెప్పారు.

# జగన్‌లా పరదాలు కట్టుకోలేదు: ప్రకాష్‌రావు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలకు మంచి చేస్తున్నారని ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాష్‌రావు (ప్రశంసించారు. సీఎం చంద్రబాబును మంగళవారం నాడు గోనె ప్రకాశరావు కలిశారు. అనంతరం మీడియాతో గోనె ప్రకాశరావు మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏపీ , తెలంగాణ రాష్ట్రాల్లో రావణాసురుడు, శిశుపాలుడి పాలన పోయిందని ఆక్షేపించారు. బంధువులే తనకు తెలీదంటూ సీబీఐ కోర్టుకు అబద్దాలు చెప్పిన దుర్మార్గుడు జగన్ అని గోనె ప్రకాష్‌రావు విమర్శించారు. జన్మభూమి లాంటి కార్యక్రమాలు చంద్రబాబు చేపడితే విదేశీ విరాళాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఏపీలో 36 మందిని హత్య చేసినట్లుగా చెబుతున్న జగన్ వాటి వివరాలు బహిర్గతం చేయాలని గోనె ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు. దేశంలోని ఏ ముఖ్యమంత్రి జగన్‌లా పరదాలు కట్టుకుని పర్యటించలేదని ఆక్షేపించారు. రాష్ట్రపతి పాలన అంటూ డిమాండ్ చేసిన జగన్‌కు సిగ్గుందా..? అని విమర్శించారు. ప్రజల నుంచి పూర్తి మెజార్టీ వచ్చాక రాష్ట్రపతి పాలన ఎలా అనుమతిస్తారని గోనె ప్రకాష్‌రావు ప్రశ్నించారు.

# ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని కోర్టుకు వెళతాం వైఎస్ జగన్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీలో వైసీపీ శ్రేణులు, ప్రజలపై జరుగుతున్న దాడులపై హైకోర్టు, సుప్రీం కోర్టుల కు వెళతామని, రాష్ట్రంలో ఎందుకు రాష్ట్రపతి పాలన విధించకూడదో కోర్టులను అడుగుతామని మాజీ సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. టీడీపీ శ్రేణుల దాడుల్లో గాయపడ్డ వైసీపీ కార్యకర్తలను మంగళవారం విజయవాడ ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యారని ఆరోపించారు. మహిళలు, చిన్నపిల్లలపై అఘాత్యాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఏపీలో దాడులు, కిరాతాలకు పాల్పడి ఏం సాధిస్తారని చంద్రబాబును ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వంపై వ్యతిరేకత రావడానికి సమయం పడుతుందని, కాని కూటమి ప్రభుత్వానికి కొద్ది సమయంలో వ్యతిరేకత ఫాస్ట్‌గా ప్రారంభమయిందని ఆరోపించారు. కక్షలు, కార్పణ్యాలు తీర్చుకోవాలని చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి భయాందోళనలు నెలకొని ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రోజులు ఒకేలా ఉండవని తామూ అధికారంలోకి వస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొనసాగుతున్న దాడులను జాతీయ స్థాయికి తీసుకెళ్లి వివరించామని తెలిపారు. దాడులతో ప్రజలు ఎవరూ కూడా భయపడరని, ఇది కోపంగా మారి ప్రభుత్వాన్ని, పార్టీని బంగాళాఖాతంలోకి కలిపే పరిస్థితులు వస్తాయన్నారు. చదువులను, వైద్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.

# జ'గన్' .. 59 మంది గన్‌మెన్లు చాలదా ?



**కడప జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ ముఖ్యమంత్రి, వైస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 139 మంది గన్‌మెన్లను అడుగుతున్నది భద్రత కోసం కాదని స్టేటస్, హంగు, ఆర్భాటం కోసమని పీసీసీ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎన్. తులసి రెడ్డి విమర్శించారు. జగన్ రెడ్డి 59 మంది గన్‌మెన్లు చాలదా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం తనకు 59 మంది గన్‌మెన్లను ప్రభుత్వం ఇచ్చిందని గుర్తుచేశారు.
వారు చాలారని...139 మంది గన్‌మెన్లను ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని జగన్ హైకోర్టులో పిటిషన్ వేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇది జగన్ పిరికితనానికి దర్పణమని ఆక్షేపించారు. అయినా ఏపీ ప్రభుత్వం 59 మందిని ఇవ్వడమే తప్పు అని తులసి రెడ్డి చెప్పారు. అందరు ఎమ్మెల్యేలు లాగా జగన్ కూడా ఒక ఎమ్మెల్యే మాత్రమే అని చెప్పారు. ఎమ్మెల్యేలకు 1o1, 2o2గానీ గన్‌మెన్ల భద్రతను మాత్రమే ప్రభుత్వం కల్పిస్తుందని వెల్లడించారు. అలాగే జగన్‌కు కూడా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**హైకోర్టులో పిటిషన్ ఎందుకు..?**

స్టేటస్ కోసం గన్‌మెన్లను ఇవ్వడం సరికాదని అన్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదా కోసం జగన్ హైకోర్టులో పిటీషన్ వేయడం విడ్డూరంగా ఉందని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలంటే అసెంబ్లీలో ఎమ్మెల్యేల మొత్తం సంఖ్యలో 10 శాతం ఎమ్మెల్యేలు ఆ పార్టీకి ఉండాలనే నిబంధనలు చెబుతున్నాయని గుర్తుచేశారు. వైసీపీ ఎమ్మెల్యేల సంఖ్య 11 మాత్రమేనని.. అందుకే గన్‌మెన్లను ఇవ్వలేదని చెప్పారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, జైపాల్ రెడ్డి లాంటి వారు కేవలం ఎమ్మెల్యే హోదాలో రాణించ లేదా? అని నిలదీశారు. జగన్ చిన్న పిల్లల మాదిరిగా మారాం చేస్తున్నారని తులసిరెడ్డి విమర్శించారు.

# నాగార్జునసాగర్‌కు కొనసాగుతున్న వరద.. 22 గేట్లు ఎత్తివేత

**నాగార్జునసాగర్ (జర్నలిస్ట్ ఫైల్) :** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. దీంతో అధికారులు 22గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌కు 3,00,995 క్యూసెక్కుల వరద వస్తుంది. దీంతో క్రస్ట్ గేట్ల ద్వారా 2,55,296 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7601 క్యూసెక్కులు, కుడి కాలువకు 7878, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,420 క్యూసెక్కులు, ఏఎమ్మార్ ప్రాజెక్టుకు 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పులిచింతల ప్రాజెక్టు క్రమంగా నిండుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా, ఇప్పుడు 142.71 అడుగులుగా ఉన్నది. 45.77 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికిగాను 10.65 టీఎంసీలు ఉన్నాయి. ప్రాజెక్టుకు 74,443 క్యూసెక్కుల వరద వస్తుండగా, 25,676 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# ఏపీలో విద్యాహక్కు చట్టం అమలు బాగుంది

- ప్రశంసించిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్ లో సోమవారం జరిగిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలుతీరును జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రశంసించిందని ఏపీ విద్యాహక్కు చట్టం నోడల్ అధికారి డి.మధుసూదనరావు తెలిపారు.
ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తరపున విద్యాహక్కుచట్టం నోడల్ అధికారి శ్రీ డి మధుసూదన రావు గారు పాల్గొని ఆంధ్రప్రదేశ్ లో విద్యాహక్కు చట్టం అమలు తీరు తెన్నులను, సెక్షన్ 32 ప్రకారం నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను, విద్యార్థులకు కల్పిస్తున్న రక్షణలను, సెక్షన్ 12 (1)సి ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో కల్పించిన ప్రవేశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ నుండి ఆర్టీఈ కన్సల్టెంట్ డా. కె. పెంచలయ్య, సహాయ సంచాలకులు పి.శ్రీనివాసరావు, శరత్ బాబు, సంధాని భాషా తదితరులు హాజరయ్యారు.

# ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై గుర్తుతెలియని దుండగులు దాడి..

**ఏలూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లపై ఇటీవల కాలంలో తరచూ దాడులు పెరిగిపోతున్నాయి. ఈ దాడులు చేసే వారిలో ఎక్కువగా ప్రయాణికులే ఉంటారు. అయితే ఈ సారి అందుకు భిన్నంగా కొంతమంది దుండగులు డ్రైవర్‌పై దాడికి తెగబడ్డారు. కొవ్వూరు నుంచి వస్తున్న బస్సు సాంకేతిక కారణాలతో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం వద్ద నిలిచిపోయింది. డిపోకు సమాచారం ఇచ్చిన డ్రైవర్ పొలిమాటి బాబు సిబ్బంది కోసం ఎదురుచూస్తున్నారు. అయితే అదే సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు అపరిచితులు డ్రైవర్ వద్ద ఉన్న సెల్ ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించారు. ఇద్దరు దొంగలు అతడిని పట్టుకోగా మరో వ్యక్తి డ్రైవర్ తలపై రాయితో కొట్టారు. తీవ్రగాయలై పడిపోయిన డ్రైవర్ వద్ద నుంచి ఫోన్ తీసుకుని పరారయ్యారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో డ్రైవర్ బాబుని జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటన సమయంలో బస్సులో ప్రయాణికులు లేకపోవడంతో దుండగలు రెచ్చిపోయారు.

# గద్దర్ పోరాట స్ఫూర్తిని ఎప్పటికీ మరువలేం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతికినన్ని రోజులు పీడిత వర్గాల గొంతుకగా గద్దర్ నిలిచారని కొనియాడారు. నక్సల్ పోరాటం నుంచి తెలంగాణ ఉద్యమం వరకూ గద్దర్ తన గానంతో ప్రజలను చైతన్య పరిచారని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని ఎప్పటికీ మర్చిపోలేమని తెలిపారు. కాగా, తెలంగాణ ఉద్యమంలో.. “పొడుస్తున్న పొద్దు మీద.. అమ్మా తెలంగాణమా” వంటి విప్లవాత్మక పాటలు ప్రజల్లో విప్లవ స్ఫూర్తిని రగిల్చాయి. పేదల రాజ్యమే అంతిమ లక్ష్యంగా ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయం. పీడిత ప్రజల గొంతుకగా నిలిచి పాటకు పోరాటం నేర్పిన ప్రజాయుద్ధ నౌక గద్దరన్న చనిపోయి నేటితో ఏడాది అవుతుంది అంటే నమ్మలేకపోతున్నామని పేర్కొన్నారు.

# నంద్యాల రూరల్ సీఐ , మహనంది ఎస్సై పై సస్పెన్షన్ వేటు




**నంద్యాల (జర్నలిస్ట్ ఫైల్) :** నంద్యాల రూరల్ సీఐ శివ కుమార్ రెడ్డి, మహనంది ఎస్సై నాగేంద్రప్రసాద్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 4న మహానంది మండలం సీతారామపురంలో జరిగిన ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో ఉన్నతాధికారులు వారిని సస్పెండ్ చేశారు. గ్రామానికి చెందిన బుడ్డారెడ్డి శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి తన అనుచరులతో వచ్చి అదే గ్రామానికి చెందిన పసుపులేటి సుబ్బరాయుడుపై దాడి చేసి హతమార్చారు. ఈ ఘటనకు ముందు పరిస్థితిపై సకాలంలో ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడంలో సీఐ, ఎస్సై విఫలమయ్యారంటూ అధికారులు వారిపై చర్యలు తీసుకున్నారు.
పసుపులేటి సుబ్బరాయుడి హత్యకు ఆర్థిక విభేదాలే కారణమని తెలుస్తోంది. బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడు ఇద్దరూ వైకాపాలో ఉన్నప్పుడే ఆర్థికపరమైన విషయాల్లో గొడవలు పడేవారు. సుబ్బరాయుడుకు చెందిన 15 సెంట్ల స్థలాన్ని శ్రీనివాసరెడ్డి తీసుకోవడం, మరోచోట స్థలం ఇస్తానని చెప్పిన మాట మూడేళ్లుగా అమలు చేయకపోవడంతో గొడవలు జరిగేవి. మూడు సెంట్ల స్థలాన్ని రూ. 2లక్షలకు కొనుగోలు చేయించిన శ్రీనివాసరెడ్డి ఆ స్థలం కూడా ఎక్కడుందో చూపించకుండా సుబ్బరాయుడికి ఇబ్బంది పెట్టేవాడని అంటున్నారు. శ్రీనివాసరెడ్డి వైకాపా నుంచి తెదేపాలోకి మారినా సుబ్బరాయుడు వైకాపాలోనే ఉండిపోయారు. మరోవైపు తన ఎకరా పొలాన్ని శ్రీనివాసరెడ్డి తీసుకున్నాడని, ప్రత్యామ్నాయంగా ఇస్తానన్న పొలం ఇవ్వాలని నిలదీస్తే అత్యాచారం కేసు పెట్టించి జైలుకు పంపించాడని గ్రామానికి చెందిన పల్లంరాజు వాపోయారు.
శనివారం అర్ధరాత్రి సుబ్బరాయుడు, పల్లంరాజుల ఇళ్లపై దాడులు జరగడానికి వారితో శ్రీనివాసరెడ్డికి ఉన్న విభేదాలే కారణమని తెలుస్తోంది. సుబ్బరాయుడి హత్యోదంతంలో పోలీసులు వ్యవహరించిన తీరుపైనా విమర్శలు వచ్చాయి. మహానంది ఎస్సై నాగేంద్రప్రసాద్ కేవలం ఇద్దరు కానిస్టేబుళ్లతో సీతారామపురానికి వెళ్లడం, పరిస్థితి తీవ్రతను పోలీసు ఉన్నతాధికారులకు వివరించకపోవడంపై విమర్శలు వచ్చాయి. నంద్యాల శివారు నుంచి ఐదు కి.మీ. దూరంలోనే ఉన్న సీతారామపురానికి అదనపు బలగాల్ని పంపాలని కోరితే కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉన్నా.. ఉదాసీనంగా వ్యవహరించారని స్థానికులు మండిపడుతున్నారు. శ్రీనివాసరెడ్డితోపాటు సుమారు 38 మంది గ్రామంలో దాడి చేయడానికి తిరుగుతున్నా, వచ్చిన వారిలో సుమారు 10 మంది గ్రామస్థులే కాకపోయినా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే అధికారులు సీఐ, ఎస్సైపై చర్యలు తీసుకున్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467